

నేటి కందం- నేటికి అందం

ప్రజనాథుడు దయచూపగ
ప్రజలను సేవించి మంచి బ్రతుకుల నిడగన్
సృజనాత్మక సాంకేతిక
నిజసంస్థను నెలకొలిపిరి నేటి దినమునన్ !!

ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ ని ఈరోజు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్,ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రారంభించారు.



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

పార్టీలకు విశ్వాసం
పలుచనైతే పెను నష్టం
ప్రజల్లోనా తిరిగి దాన్ని
పొందటమే మరీ కష్టం

నిన్న నేడు మంచి చెడు
నిత్యం నిజం గమనిస్తరు
నమ్మకాన్ని వమ్ముచేసి
నటిస్తుంటే తొలిగిస్తరు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 20-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:259 పేజీలు:6 వెల: రూ.1/-


## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం : మంత్రి పొన్నం



కరీంనగర్, జులై 19:బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, కచ్చితంగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలియజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో సర్వే చేసిందని, సర్వేలో పాల్గొనని వారికి దీనిపై మాట్లాడే అర్హత లేదన్నారు.

కులగణన సమీకరించి ఎక్స్పర్ట్ కమిటీ వేసి ఏం చేయాలనే దానిపై ఈరోజు కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల సర్వేకి మాజీ జడ్జి సుదర్శన్ రెడ్డి కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందన్నారు. కుల సర్వే తరువాత సబ్ కమిటీ క్యాబినెట్ కి ఇచ్చి కేబినెట్ అందించి బిల్లును సభలో పెట్టిందన్నారు. ఆ బిల్లు గవర్నర్ దగ్గర నుండి రాష్ట్రపతి దగ్గరకు వెళ్లిందని, బీజేపీ కేంద్ర మంత్రులకు బీసీల మీద ప్రేమ ఉంటే రాష్ట్రపతి దగ్గర ఉన్న బిల్లును ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు అడ్డంకులు వస్తే ఆర్డినెన్స్ తెచ్చి సవరిస్తున్నాం. బీసీ రిజర్వేషన్లపై మా చిత్తశుద్ధి శంకిస్తే మీకు పుట్టగతులు ఉండవు.. బీసీలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుకుంటున్నారు. కులగణన మొదలు ఆర్డినెన్స్ వరకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. ఇది కాకుండా ఎలా అమలవుతాయో చెప్పండి కచ్చితంగా చేస్తాం.

బీసీ రిజర్వేషన్ అడ్డుకునేందుకు కుట్ర..

బీసీ రిజర్వేషన్ అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారు. బిల్లుకు మద్దతు తెలపాల్సింది పోయి, నడిచే వాళ్ళ కాళ్లలో కట్టె అడ్డంపెట్టినట్టు చేస్తున్నారు. కడుపులో కత్తులు పెట్టుకొని మీదికి మరోలా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ కుల సంఘాలు ఎవరూ చూస్తూ ఊరుకోరన్నారు. తెలంగాణ ఉద్యమంలో కుల సంఘాలు ఎలా పోరాడాయో రిజర్వేషన్లు కాపాడుకోవడానికి కూడా అలా పోరాడాలి. 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అండగా ఉండాలన్నారు. కుట్రలు చేస్తే బలహీన వర్గాలు, ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలు చూస్తూ ఊరుకోరు. తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## నేడు లాల్ దర్వాజా బోనాలు.. ట్రాఫిక్ ఆంక్షలు, వైన్ షాపులు బంద్ !





హైదరాబాద్, జులై 19:హైదరాబాద్‌లో లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ వెల్లడించారు. ఈ ఆంక్షలు జూలై 20-21 తేదీలలో అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా, సింహవాహిని మహంకాళి లాల్ దర్వాజా ఆలయంలో జూలై 21న నిర్వహించే బోనాల సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆలయం పరిసర ప్రాంతాల్లో సాధారణ వాహనాల రాకపోకలకు అనుమతి నిరాకరించబడుతుంది.

ట్రాఫిక్ ఆంక్షల వివరాలు..

ఇంజన్ బౌలి, ఫలక్ నుమా నుంచి అలియాబాద్ వైపు వచ్చే వాహనాలను న్యూ షంషేర్ గంజ్ వద్ద నుంచి గోశాల, మిస్రీగంజ్ వైపు మళ్లిస్తారు.

మహబూబ్ నగర్ క్రాస్ రోడ్డు నుంచి అలియాబాద్ వైపు వచ్చే వాహనాలు ఇంజన్ బౌలి నుంచి జహనుమా, గోశాల వైపు మళ్లించబడతాయి.

నాగులచింత, సుధాటాకీస్ వైపు నుంచి లాల్ దర్వాజాకు వెళ్లే వాహనాలను గౌలిపురా వైపు మళ్లిస్తారు.

చార్మినార్ నుంచి నల్లచింత వైపు వచ్చే వాహనాలను హరిబౌలి, ఓల్గా హోటల్ వైపు మళ్లిస్తారు.

వీటితో పాటు, మరికొన్ని ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ మార్గాల్లో తాత్కాలిక మార్పులు ఉంటాయని జోయల్ డేవిస్ పేర్కొన్నారు.

మరోవైపు, హైదరాబాద్‌లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బోనాల ఉత్సవాల సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల కారణంగా రోడ్లు జారుగా మారే అవకాశం ఉన్నందున వాహనదారులు, పాదచారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ శాఖ విజ్ఞప్తి చేసింది.

ట్రాఫిక్ ఆంక్షలు .. వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని భక్తులు ప్రయాణ ప్రణాళికలు రూపొందించుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ శాఖ కోరింది.

రెండు రోజుల పాటు వైన్ షాపులు బంద్

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా వైన్ షాపులు, బార్లను 20, 21న మూసివేయాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జూలై 20న ఉదయం 6 గంటల నుంచి జూలై 22 ఉదయం 6 గంటల వరకు తెలంగాణలో మద్యం విక్రయాలను నిలిపివేశారు. ప్రజలు ప్రశాంతంగా బోనాలు జరుపుకునేందుకు వీలుగా ఎలాంటి అవాంఛిత ఘటనలు జరగకుండా నివారించే క్రమంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. అయితే వైన్స్ బంద్ కేవలం హైదరాబాద్ నగరంలో మాత్రమేనని మె?త్తం రాష్ట్రం అంతగా కాదని గమనించాలి ప్రజలు. రాష్ట్ర వ్యాప్తంగా సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ప్రజలు బోనాలు జరుపుకుంటారు. అందుకే 21న తెలంగాణ వ్యాప్తంగా విద్యా సంస్థలకు, బ్యాంకులకు సెలవుగా ప్రకటించింది.

## తెలుగు భాష అంతటా పరిఢవిల్లుతుంది

### - మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు



హైదరాబాద్ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంగ్ల భాష గురించి గొప్పలు చెప్పుకుంటున్నా ఆ భాష మాట్లాడే వారు ఈనాటికీ అల్ప సంఖ్యాకులేనని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు అన్నారు. గ్రామాలతో సహా తెలుగు అంతటా పరిఢవిల్లుతున్నదని చెప్పారు. శాంతా వసంతా ట్రస్టు ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో తెలుగు వర్సిటీ పూర్వ విసి, ప్రముఖ రచయిత ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించిన డా.సి నారాయణ రెడ్డి కథా కావ్య సమాలోచన గ్రంథావిష్కరణ సభ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పదనాన్నిఈ తరానికి పరిచయం చేయడానికి విరివిగా సాహిత్య కార్యక్రమాలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రాచీన భాష అయిన తెలుగుకు గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉన్నదని ఆయన గుర్తు చేశారు. విదేశాలలో నివసిస్తున్న ప్రవాస ఆంధ్రులు తెలుగు భాషను కాపాడుకుంటున్నారని ఆయన వివరించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో 25 ఏళ్ళ ప్రాయం నిండక ముందే డాక్టర్ సి .నారాయణ రెడ్డి నాగార్జునసాగరం,ఆ తర్వాత కర్పూర వసంత రాయలు, విశ్వనాథ నాయడు, రుతు చక్రం కథాత్మక గేయ కావ్యాలు వరుసగా రచించి సాహిత్య లోకంలో సుప్రసిద్ధులయ్యారని తెలిపారు. పరిశోధకుడు జీబీ శంకర్రావు గ్రంథాన్ని పరిచయం చేస్తూ కావ్యగతమైన సాహిత్య విశేషాలను విద్యార్థులకు సైతం సులభంగా అర్థమయ్యే విధంగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య ఈ గ్రంథాన్ని రచించారని తెలిపారు.అనుమాండ్ల భూమయ్య ఈ గ్రంథాన్ని శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ కే ఐ వరప్రసాద్ రెడ్డికి అంకితం ఇచ్చారు. వర ప్రసాద్ రెడ్డి పై రాసిన అంకిత పద్యాలను గానం చేశారు. నారాయణ రెడ్డితో అనుబంధం, భూమయ్య సాహితీ మూర్తిమత్వంపై గౌరవం వల్ల కృతిని స్వీకరించే అవకాశం తీసుకున్నానని వరప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య సభను సమన్వయం చేశారు .ట్రస్టు కార్యదర్శి తొడుపునూరి నవీన్ పాల్గొన్నారు.

## బోనాల జాతరకు గట్టి బందోబస్తు చర్యలు: ఈస్ట్ జోన్ డిసిపి డాక్టర్ బాలస్వామి

హైదరాబాద్, జుల్తై 19:ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజులు పాటు జరిగే ఆషాడ మాస బోనాల జాతరకు గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తూర్పు మండలం డీసీపీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. జోన్ పరిధిలోని 10 పోలీస్ స్టేషన్‌లో కిందకు వచ్చే అన్ని అమ్మవారి దేవాలయాల వద్ద బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

డీసీపీ డాక్టర్ బాలస్వామి మీడియాతో మాట్లాడుతూ.. బోనాల బందోబస్తు వివరాలను వెల్లడించారు. తూర్పు మండల పరిధిలో సుల్తాన్ బజార్, నారాయణగూడ, కాచిగూడ, అంబర్‌పేట, నల్లకుంట, ఉస్మానియా యూనివర్సిటీ, వారాసిగూడ, చిలకలగూడ, లాలాపేట, లాలాగూడ పోలీస్ స్టేషన్ లు ఉన్నాయని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధానంగా మూడు చోట్ల బోనాల ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయని చెప్పారు. అందులో కాచిగూడ నింబోలి అడ్డ మహంకాళి అమ్మవారు, అంబర్ పేట మహంకాళి అమ్మవారం, చిలకలగూడ అమ్మవారి దేవాలయాల వద్ద ఆది, సోమవారాలు రెండు రోజులపాటు బోనాల ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయని, అక్కడ ప్రత్యేకమైన బందోబస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వెయ్యి మంది తమ పోలీసు సిబ్బందితో పాటు అదనపు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బోనాలు, ఫలహారపు బండ్ల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేస్తూ బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకొంటున్నట్లు వెల్లడించారు. బోనాల సందర్భంగా భక్తులు, నిర్వాహకులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఉక్రెయిన్‌పై మళ్లీ విరుచుకుపడ్డ రష్యా.. 300కు పైగా డ్రోన్‌లతో దాడి

న్యూఢిల్లీ, జులై 19: రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్నాయి. అయినా ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో అనేక ఉక్రెయిన్‌లో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు తెలిసింది.

భవనాల శిథిలాల కింద అనేక మంది అమాయక ప్రజలు చిక్కుకున్నారని, వారిని బయటకు తెచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని ఉక్రెయిన్ మీడియా తెలిపింది. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించింది. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించింది. దాంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి.

అయితే ఈ యుద్ధం సమయంలో తమకు అండగా ఉంటూ ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కృతజ్ఞతలు తెలిపారు. రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సాయం చేస్తోంది. ఇందులోభాగంగా శనివారం కీవ్‌కు ఓ1ం1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణమంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు.

కీవ్‌పై మాస్కో చేస్తున్న చట్టవిరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా తాము ఈ సాయాన్ని అందిస్తున్నామని ఆస్ట్రేలియా రక్షణ మంత్రి తెలిపారు.

## కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను పరిశీలించిన కేంద్రమంత్రులు



హైదరాబాద్ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వరంగల్ ప్రజల కోరికను ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాజీపేట రైల్వేకోచ్ పరిశ్రమ అనేది వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్రమంత్రులు పరిశీలించారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగంగా సాగుతున్నాయని తెలియ ుజేశారు. 2026లో ఇక్కడ రైల్వే కోచ్ పనులు ప్రారంభం అవుతాయని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ అనేది 40 ఏళ్ల పోరాటమని, పివి నరసింహారావు కూడా కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నించారని కిషన్ రెడ్డి అన్నారు. రైల్వే వ్యాగన్లు, కోచ్ లు, ఇంజిన్ల తయారీ పరిశ్రమను కాజీపేటకు ప్రధాని మంజూరు చేశారని, మోడీ ఏదైనా మాట ఇస్తే.. తప్పకుండా నెరవేరుస్తారని పేర్కొన్నారు.మోడీ గ్యారెంటీకి ప్రతిరూపమే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అని కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని స్వయంగా భూమిపూజ చేశారని అన్నారు.కోచ్ ఫ్యాక్టరీతో 3 వేల మందికి నేరుగా ఉపాధి కల్పిస్తామని, తెలంగాణలోని 40 వేల రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తున్నాం అని తెలియజేశారు. వరంగల్ కు ఎయిర్ పోర్టు కూడా ఇప్పటికే రావాల్సి ఉందని, ఎయిర్ పోర్టుకు భూములివ్వాలని గతంలో మాజీ సిఎం కెసిఆర్ ను కోరామని చెప్పారు. భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నామని, ఎంత త్వరగా భూములిస్తే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు పూర్తవుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## కృష్ణమ్మ పరవళ్లు.. జూరాలకు భారీ వరద !

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి పెద్ద ఎత్తున ఇన్ ఫ్లో రావడంతో జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈరోజు (శనివారం) సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి ప్రవేశించే వరద నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) 1,14,000 క్యూసెక్కులుగా నమోదైంది.

వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమై 23 గేట్లను ఎత్తి దిగువన శ్రీశైలం వైపు విడుదల చేశారు.

ఇదిలా ఉండగా, జూరాల స్పిల్‌వే ద్వారా ప్రస్తుతం 89,378 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా.. పవర్ హౌస్ ద్వారా 28,505 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.

భీమా లిఫ్ట్-ఎ ద్వారా 650 క్యూసెక్కులు, కొయిలసాగర్ లిఫ్ట్ ద్వారా 315 క్యూసెక్కులు, నెట్టంపాడు లిఫ్ట్ ద్వారా 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, పారలల్ కెనాల్ 700 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-ఎఎ ద్వారా 700 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నా రు. ఇతర డిమాండ్లు మొత్తం కలిపి 1,21,994 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టు నుంచి విడుదల అవుతోంది.

## రెండో రోజూ అదే దంచుడు.. మునకలో పలు కాలనీలు !

### -పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్!

హైదరాబాద్, జులై 19:తెలంగాణలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో కూడా వరుసగా రెండో రోజు వరుణుడి ప్రభావం కొనసాగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా? పలు కాలనీలు నీట మునిగాయి. ఈ వర్షం కారణంగా రోడ్లు, ఫ్లైఓవర్లు జలమయం కావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

ఇక ఈరోజు (శనివారం) మధ్యాహ్నం నుంచి హైదరాబాద్‌లో వర్షం ప్రారంభమైంది. బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, బేగంపేట, మారేడుపల్లి సహా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కొనసాగుతోంది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాలకు శనివారం కూడా వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఉఊఓఅ అధికారులు సూచించారు.

### జిల్లాల వారీగా వర్ష హెచ్చరికలు

భారీ వర్ష సూచన నేపథ్యంలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

అదే సమయంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఉరుములతో కూడిన వర్షాలు, గంటకు 40 కి.మీ.ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలలో కూడా వర్షాలు పడవచ్చని తెలిపారు.

### ఆదివారం వర్షాలు

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలలో ఆదివారం కూడా అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా



వేసింది. ఈ వర్షాల నేపథ్యంలో సురక్షితంగా ఉండాలని అధికారులు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని కోరుతున్నారు.

## వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలపై దృష్టి

### - హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) చెరువుల పునరుద్ధరణ, వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలపై దృష్టి పెట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇవాల్టితో హైడ్రా ఏడాది పూర్తిచేసుకుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిలోనే 30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్ని రక్షించిందని, 500 ఎకరాల భూములను అక్రమార్కుల చెర నుంచి విడిపించిందని తెలియజేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని, వారం, పది రోజుల్లోనే పరిష్కారం చూపిస్తామని చెప్పారు.

# చందమామ ఘన చరిత్రను ఆవిష్కరించాలి !

## (20 జూలై "అంతర్జాతీయ చందమామ దినోత్సవం" సందర్భంగా)

అమెరికాకు చెందిన నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) సాధించిన అద్భుత విజయ చరిత్రగా 20 జూలై 1969 నిలుస్తున్నది. ఇదే రోజు నాసా ప్రయోగించిన "అపోలో 11" అంతరిక్ష నౌకలో "నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్" చందమామ ఉపరితలంపై తొలి మానవ కాలు మోపడం జరిగింది. ఈ అపూర్వ ఘటనకు గుర్తుగా ప్రతి ఏట 20 జూలై రోజున "అంతర్జాతీయ చందమామ దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ మూన్ డే" నిర్వహించాలని నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ చేసిన ప్రతిపాదనతో 1975 నుంచి పాటించడం కొనసాగుతున్నది. అపోలో 11 చంద్రుడి ఉపరితలంపై దిగిన ఆరు గంటల తర్వాత బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలంపై కాలు మోపి రెండున్నర గంటల పాటు తిరుగుతూ అధ్యయనం చేయడం విశేషం. అదే అంతరిక్ష నౌకలో ఉన్న బజ్ ఆల్డ్రిన్ అనే వ్యోమగామి చందమామపై కాలు మోపిన రెండవ వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారు. వీరిరువురు కలిసి చంద్ర మండలంపై కలియ తిరుగుతూ, 47.5 పౌండ్ల పదార్థాలను పరిశోధనల నిమిత్తం సేకరించడం జరిగింది. అపోలో 11లో ప్రయాణించిన మూడో వ్యక్తి పైలెట్ మైఖేల్ కోలిన్స్ చంద్రమండలంపైకి దిగకుండా ఆ ఇరువురు వచ్చేంతవరకు నౌకలోనే వేచి ఉన్నారు. ఈ అంతరిక్ష అద్భుత ఘటనను అమెరికన్లు, ప్రపంచ మానవాళి తమ తమ టీవీల్లో చూసి ఆశ్చర్యచకితులు కావడం జరిగింది.

నాటి ఓ చిన్న అడుగు, నేటి ఓ భారీ ముందడుగు:

చందమామ ఉపరితలంపై ప్రథమ అడుగు వేసిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వెంటనే మాట్లాడుతూ "నేడు మనిషి వేసిన ఓ చిన్న అడుగు, రేపటి తరం మానవాళికి భారీ ముందడుగు" అంటూ అభివర్ణించడం సముచితంగా ఉన్నది. 1969 -72 మధ్య ఆరు అంతరిక్ష వ్యోమనౌకలు అపోలో 11తో పాటు అపోలో 12, 14, 15, 16, 17ల ద్వారా 12 మంది వ్యోమగాములు చంద్రమండల ఉపరితలంపై కాలు మోపడం జరిగింది. అంతర్జాతీయ చందమామ దినం-2025 ఇతివృత్తంగా "వన్ మూన్, వన్ విజన్, వన్ ఫ్యూచర్ (ఒకే చంద్రుడు, ఒకే లక్ష్యం, ఒకే భవిష్యత్తు)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది.

చందమామ పుట్టుక, మనుగడ:

స్వయం ప్రకాశిత అతి భారీ అంతరిక్ష గోళాలను నక్షత్రాలు అని, సూర్యుడి లాంటి నక్షత్రం చుట్టు తిరిగే స్వయం ప్రకాశితం కాని అంతరిక్ష గోళాలను గ్రహాలు అని, గ్రహాల చుట్టూ తిరిగే స్వయం ప్రకాశితం కాని అంతరిక్ష గోళాలను ఉప గ్రహాలు అని పిలుస్తున్నాం. శాస్త్రీయ పరికల్పన ప్రకారం, 4.6 బిలియన్ సంవత్సరాల క్రితం భూమి, అంగారక గ్రహం ఢీకోనడం ఫలితంగా చంద్రుడు అనే శాశ్వత ఉపగ్రహం ఏర్పడింది. భూమితో పోల్చితే నాలుగు రెట్లు చిన్నదైన చందమామ వ్యాసార్థం 3,479 కిమీలు, ద్రవ్యరాశి భూమి కన్న 80 రెట్లు తక్కువగా ఉంటూ, సాంద్రత ఘనపు మీటర్‌కు 3,340 కేజీలు ఉంటుంది. భూమి నుండి 2.39 లక్షల కిమీ దూరంలో ఉన్న చంద్రుడి ఉపరితలంపై సగటు ఉష్ణోగ్రత 107 డిగ్రీల సెల్సియస్, రాత్రి పూట -153 డిగ్రీలతో ఉంటూ, 27.3 రోజులకు ఒకసారీ భూమి చుట్టు తిరుగుతుంది. చందమామ స్వయం ప్రకాశితం కానప్పటికీ సూర్యుడి కిరణాలు చంద్రుడిపై పడి పరావర్తనం చెందడంలో రాత్రి వేళల్లో చల్లని వెన్నెలల వర్షాలు కురిసినట్లు చక్కటి అనుభూతి పొందుతాం. సౌర మండలంలో 5వ అతి పెద్ద ఉపగ్రహమైన చందమామ, భూమి చుట్టూ తిరిగే అతి పెద్ద సహజ ఉపగ్రహంగా పేరుగాంచింది. భూకంపాలను పోలిన చంద్ర కంపనాల్లో పలు వాయువులు విడుదల అవుతాయని గమనించారు.

ఇస్రో చంద్రయాన్ ప్రయాణ ప్రయోగాలు:

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అయిన ఇస్రో తలపెట్టిన చంద్రయాన్-1 వ్యోమనౌక చంద్రుడి కక్ష్యలో 22 అక్టోబర్ 2008 నుంచి 28 ఆగష్టు 2009 వరకు పరిశోధించడం జరిగింది. చంద్రయాన్-2 ప్రయోగంలో 20 ఆగస్టు 2019 రోజున చంద్రుడి కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాత హార్డ్ ల్యాండింగ్ కారణంగా ప్రయోగం పూర్తి కానప్పటికీ 98 శాతం వరకు ప్రయోగ లక్ష్యలను చేరుకుందని ఇస్రో తెలపడం గమనార్హం. 23 ఆగష్టు 2023న చంద్రయాన్-3 వ్యోమనౌక చంద్రుడి దక్షిణ ధృవంపై విజయవంతంగా చేరడం గమనించాం. రానున్న రోజుల్లో చంద్రయాన్-4, చంద్రయాన్-5 అంతరిక్ష ప్రయోగాలను కూడా చేయాలని ఇస్రో ఆసక్తిగా సిద్ధం అవుతున్నది.

అంతర్జాతీయ చందమామ దినం వేదికగా ప్లానిటోరియమ్‌ల సందర్శనలు, అంతరిక్ష అద్భుతాల ఆవిష్కరణలు చేయడం, ఖగోళ - అంతరిక్ష శాస్త్రాల వైపు యువతను ఆకర్షించడం, విద్యాలయాల్లో ఖగోళ క్లబ్బులు ఏర్పాటు చేయడం, బైనాక్యులర్స్ లేదా టెలిస్కోప్ వంటి ఉపకరణాల సహాయంతో సూర్య, చంద్రులను గ్రహణాలను చూడడం, మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడే పరిశోధనల మాలాలను అర్థం చేసుకోవడం లాంటి అంశాలను నిర్వహించవచ్చు. ఖగోళ, అంతరిక్ష శాస్త్రాలను వృత్తిగా నేర్చుకొని అంతరిక్ష అద్భుతాలను ఆవిష్కరించే ప్రయత్నాలకు నేటి యువత పూనుకోవాలని ఆశిద్దాం, అంతరిక్ష శాస్త్రవేత్తలను అభినందిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త యువత' ఇతివృత్తంతో జరగనున్న 'యువజన ఆధ్యాత్మిక సదస్సు'

న్యూఢిల్లీ, జులై 19:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2025 జూలై 19 నుంచి 20 వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త యువత' అనే ఇతివృత్తంతో 'యువజన ఆధ్యాత్మిక సదస్సును' నిర్వహించనుంది. ఈ చారిత్రాత్మక సదస్సు దేశవ్యాప్తంగా 100 ఆధ్యాత్మిక, సాంస్కృతిక-సామాజిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న 500 మందికి పైగా యువ ప్రతినిధులను ఒకవేదికపైకి తీసుకురానుంది. పవిత్రమైన గంగా నది ఒడ్డున జరగనున్న ఈ సమావేశం మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా భారతదేశ ఆధ్యాత్మికత, యువశక్తిలో ఉన్న సంకల్పాన్ని జాతీయ స్థాయిలో సమష్టిగా పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సదస్సులో హిమాచల్ ప్రదేశ్ గౌరవ గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా.. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ.. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్.. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్.. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే వంటి ప్రముఖులు పాల్గొనను న్నారు. ఉత్తరప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి శ్రీ గిరీష్ యాదవ్.. ఉత్తరప్రదేశ్ సామాజిక సంక్షేమం, ఎస్సీ/ఎస్టీ సంక్షేమ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర) శ్రీ అసిమ్ అరుణ్.. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అబ్కారీ శాఖ(స్వతంత్ర) మంత్రి శ్రీ నితిన్ అగర్వాల్ కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా యువత నేతృత్వంలో విలువలతో కూడిన ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాలనే విస్తృత లక్ష్యంలో భాగంగా మంత్రిత్వ శాఖ ఈ యువజన సదస్సును నిర్వహిస్తోంది. ఒక మంచి అనుభవం ఇచ్చే విధంగా ఈ సదస్సును రూపొందించారు. ఆత్మపరిశీలన వైపు నడిపించే అంశాలను సాంస్కృతిక, ఆధ్యాత్మిక పద్ధతులతో మిళితం చేయనుంది. నాలుగు ప్లీనరీ సమావేశాలు జరగనున్నాయి.

ఇందులో వ్యసనం వల్ల కలిగే మానసిక, సామాజిక ప్రభావాన్ని అర్థం చేసుకోవడం.. మాదకద్రవ్యాల సరఫరా, క్రయవిక్రయాల వ్యవస్థలను నిర్వీర్యం చేయడం.. క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా ప్రచారం చేయటం, కమ్యూనికేషన్ వ్యూహాలు.. నషా ముక్త భారత్‌ను సాధించేందుకు ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించటంపై చర్చించనున్నారు.

వైట్‌బోర్డ్ ఫోరమ్‌లు, నిపుణుల కీలక ప్రసంగాలు.. యువత నాయకత్వంలో ఆలోచనలు, ఆవిష్కరణలు జరిగే వేదికను అందించే కార్యశాలలు ఇందులో ఉండనున్నాయి.

రెండు రోజుల పాటు జరగనున్న ఈ చర్చలు సమష్టిగా శక్తివంతమైన ఫలితాన్ని ఇవ్వనున్నాయి. జూలై 20న 'కాశీ డిక్లరేషన్' విడుదలతో సదస్సు ముగియనుంది.

ఇది మాదకద్రవ్య రహిత భారతదేశాన్ని నిర్మించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అందిస్తూ.. యువత, ఆధ్యాత్మిక నాయకుల సమష్టి దార్శనికత, నిబద్ధతను తెలియజేయనుంది. ఇది మాదకద్రవ్యాల వ్యసనాన్ని తగ్గించటం, వ్యసనపరుల పునరావాసంపై పనిచేస్తోన్న యువజన సంఘాలు, పౌర సంస్థలతో పాటు విధాన రూపకర్తలకు ఒక మార్గదర్శక పత్రంగా ఉపయోగపడుతుంది.

మై భారత్ వేదికతో కలిసి ఈ సదస్సు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జాతీయ ప్రజా ఉద్యమాన్ని కూడా ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞతో కూడిన ప్రచారాలు, క్షేత్రస్థాయి ప్రచార కార్యకలాపాలకు మై భారత్ స్వచ్ఛంద సేవకులు, అనుబంధ యువజన సంఘాలు నాయకత్వం వహించనున్నాయి. ఇవన్నీ నైతికంగా దృఢ నిశ్చయంతో కూడిన అందరి భాగస్వామ్య నాయకత్వంతో నడిచే సుస్థిర జాతీయ ఉద్యమాన్ని తయారుచేయాలన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు : సీఐ దేవేందర్ రావు

చెన్నూర్, జులై 19: చెన్నూరు గోదావరి తీరప్రాంతాల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ దేవేందర్ రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈరోజు ఉదయం మండలంలోని సుందరశాల గోదావరి తీరం నుంచి సోమనపల్లి గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు. అనంతరం పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి సంబందితుల పై కేసు నమోదు చేశారు.

## గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు : సీఐ రమణమూర్తి



జన్నారం, జులై 19 : గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లక్షేటి పేట సీఐ రమణమూర్తి అన్నారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ భాస్కర్ , ఏసీపీ ప్రకాష్ పర్యవేక్షణలో మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ లోని గాంధీ నగర్ లో శనివారం ఉదయం గార్డెన్స్ సెర్చ్ నిర్వహించారు.

ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల నిర్మూలనలో భాగంగా గంజాయి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. గంజాయి, గుడుంబా విక్రయించినా, సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. గంజాయి విక్రయించినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ముఖ్యంగా యువకులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలను చైతన్యపరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష, దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్, లక్షెట్టిపేట అదనపు ఎస్సై రామన్న, లక్షెటిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై జి.మౌనిక, అటవీ శాఖ, ఎక్సైజ్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అద్దె బస్సులను ప్రారంభించిన మంత్రి శ్రీహరి



నారాయణపేట , జులై 19 : నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్టీసీకి మూడు అద్దె బస్సులను అందజేయగా ఇవాళ సాయంత్రం మక్తల్ పట్టణం లో స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి అద్దె బస్సులను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. వడ్డీ రాయితీ తిరిగి మహిళా సంఘాల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. మహిళలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రం నారాయణపేటలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 5నెలల క్రితం ప్రారంభించడం జరిగిందన్నారు.

నేడు ఆర్టీసీకి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మూడు అద్దె బస్సులను ఇవ్వడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా నిలబడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి మొగులప్ప, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి ఆయా మండలాల ఎంపీడీవోలు మహిళా సమైక్య అధ్యక్షులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి..



నంద్యాల , జులై 19: జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలంలో వెలిసిన శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల దర్శనార్థం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వై.లక్ష్మినారాయణ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్ల దర్శనార్థమై ఉదయం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు అర్చక వేదపండితులు ఆలయ సంప్రదాయంలో భాగంగా స్వాగతం పలికారు.వీరు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారికి విశేష రుద్రాభిషేకం చేపట్టారు. శ్రీ భ్రమరాంబదేవికి విశేష కుంకుమార్చనాదివిశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనాలు వల్లించారు. కార్యనిర్వహణాధికారి స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, స్వామివార్ల జ్ఞాపిక, ప్రసాదములనిచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.


ఆహ్వానము

తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచన

సృష్టికర్త శతకము



ఆవిష్కరణ మహోత్సవము

తేది: 27 జూలై 2025 ఆదివారం సాయంత్రం గం.6లకు

వేదిక: రామ్మోహన్ గ్రంథాలయం, బందర్ రోడ్, బందరు లాకులు దగ్గర, విజయవాడ

సభాధ్యక్షులు: డా॥ జి.వి.పూర్ణచంద్ శతాధిక గ్రంథకర్త

పుస్తక ఆవిష్కర్త: శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ అధ్యక్షులు, సరసభారతి

గ్రంథసమీక్ష: డా॥ గుమ్మా సాంబశివరావు ప్రముఖ రచయిత, సాహితీవిమర్శకులు

ఈ సభకు మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

- చలపాక ప్రకాష్ వ్యవస్థాపక కార్యదర్శి

రమ్యభారతి సాహిత్య వేదిక


## హైదరాబాద్‌లో డీఆర్‌డీఓకు చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ క్షిపణి కాంప్లెక్సును సందర్శించిన కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి

హైదరాబాద్, జులై 19:హైదరాబాద్ డీఆర్‌డీఓకు చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ క్షిపణి కాంప్లెక్సును కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ ఈ నెల 16, 17 తేదీల్లో సందర్శించారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్), రిసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)లతో పాటు మిసైల్ క్లస్టర్ ల్యాబ్స్‌లో భాగంగా ఉన్న అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ (ఏఎస్‌ఎల్) చేపడుతున్న క్షిపణులు, ఆయుధ వ్యవస్థలకు సంబంధించిన కార్యక్రమాన్ని మంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు.

డీఆర్‌డీఎల్ లో కీలక విభాగాలైన అస్త్ర ఎంకే ఎ అండ్ ఎఎ, స్క్రాంజెట్ ఇంజిన్ రూపకల్పన కేంద్రాలతో పాటు స్వల్ప శ్రేణి దూర లక్ష్యాలను ఛేదించడానికి ఉపరితలం నుంచి నింగిలోకి నిలువుగా ప్రయోగించడానికి అనువైన క్షిపణి రూపకల్పన కేంద్రాలను కూడా రక్షణ శాఖ సహాయ మంత్రి సందర్శించారు. ఈ ప్రాజెక్టుల పురోగతి ఏ స్థితిలో ఉన్నదీ ప్రముఖ శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్) శ్రీ యు. రాజబాబుతో పాటు డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీ జి.ఎ. శ్రీనివాసమూర్తి మంత్రికి వివరించారు.

వివిధ కీలక పనులను నిర్వహిస్తున్న రీసెర్చ్ సెంటర్ ఇమారత్ విభాగాలను కూడా శ్రీ సంజయ్ సేథ్ సందర్శించారు. ఈ సందర్భంగా... స్వదేశీ నావిగేషన్ సిస్టమ్స్, ఏవియేషన్ సిస్టమ్స్, ఆన్‌బోర్డ్ కంప్యూటర్ విభాగంతో పాటు ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్ సదుపాయాల పురోగతిని ఆర్‌సీఐ డైరెక్టర్ శ్రీ అనింద్య బిశ్వాస్ మంత్రికి వివరించారు.

దేశీయంగా అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను రూపొందిస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' (స్వయంసమృద్ధ భారత్) ఆవిష్కారంలో కీలకపాత్రను పోషిస్తున్నారంటూ డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్తలను రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే విధంగా శాస్త్రవేత్తలు... సాయుధ దళాలను బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

## హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హన్మకొండ, జులై 19: (నేటినిజం ప్రతినిధి)హనుమకొండ పలివేల్పుల రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల వరంగల్ వెస్ట్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

హాస్టల్ లోని తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడారు. వెల్ నెస్ సెంటర్ తో పాటు కిచెన్, డైనింగ్ హాలును పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిలువ చేసిన బియ్యం, కూరగాయలు, ఇతర వంట పదార్థాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

వంట చేస్తున్న కార్మికులతోనూ కలెక్టర్ మాట్లాడారు. టాయిలెట్స్ బ్లాక్ తో పాటు పాఠశాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రొవిజన్స్ ఎక్కడి నుంచి వస్తాయని, ఎలా ఇండెంట్ నమోదు చేస్తారని కలెక్టర్ ఆరా తీశారు. కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి విద్యార్థినులకు ఏ విధంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో ఏర్పాటుచేసిన ఫోన్ సౌకర్యాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఐదో తరగతిలో చేరిన విద్యార్థినుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హాస్టల్ లోని సౌకర్యాలు, సదుపాయాలను గురించి ప్రిన్సిపల్ సుభాషిణి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గోవా గవర్నర్ అశోక్‌కు మంత్రి అనిత అభినందనలు



విజయనగరం, జులై 19:: గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన మాన్సాస్ ఛైర్మన్, మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు కి రాష్ట్ర హోం అండ్ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు.

శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎం ఎస్ ఎం ఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు కోళ్ల లలిత కుమారి, పూసపాటి అతిధి గజపతిరాజు పాల్గొన్నారు.

## మధురై, కన్యాకుమారి వెళ్లే ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!

న్యూఢిల్లీ, జులై 19:ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. కాచిగూడ-మధురై, హైదరాబాద్-కొల్లం, హైదరాబాద్-కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఉన్న రద్దీని దృష్టిలో పెట్టుకొని స్పెషల్ రైళ్లను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. కాచిగూడ-మధురై (07191) రైలును ఆగస్టు 18 నుంచి అక్టోబర్ 13 వరకు ప్రతి సోమవారం రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పింది. మధురై ? కాచిగూడ (07192) రైలు ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 15 వరకు ప్రతి బుధవారం రైలు అందుబాటులో ఉండనుందని పేర్కొంది.

హైదరాబాద్ - కొల్లం (07193) రైలు ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 10 వరకు ప్రతి శనివారం.. కొల్లం -హైదరాబాద్ (07194) రైలు ఆగస్టు 18 నుంచి అక్టోబర్ 13 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుందని చెప్పింది.

# ముంబయిలోని ఎన్ఎఫ్‌డీసీ కాంప్లెక్స్‌లో ఐఐసీటీ మొదటి క్యాంపస్ ప్రారంభం




న్యూఢిల్లీ, జులై 19:ముంబయిలోని ఎన్ఎఫ్‌డీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ' (ఐఐసీటీ) మొదటి క్యాంపస్, కార్యనిర్వహణ సముదాయం, తరగతి గదులను మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర సమాచార, ప్రసార, రైల్వేలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్‌లు ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఎన్ఎఫ్‌డీసీ-నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా (ఎన్ఎమ్ఐసీ)లోని గుల్షన్ మహల్‌లో వేవ్స్ 2025 భారత్ పెవిలియన్‌నూ వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్ 2025) మొదటి ఎడిషన్ ఫలితాలు-ప్రభావాల నివేదికలను వారు విడుదల చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలు, ఐటీ శాఖల మంత్రి శ్రీ ఆశిష్ షెలార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేష్ సింగ్ మీనా, కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐఐసీటీ గుర్తుతో పాటు, పదిహేడు కోర్సులనూ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మహారాష్ట్ర ఫిల్మ్, స్టేజ్ అండ్ కల్చరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎమ్ఎఫ్ఎస్‌సీడీసీఎల్) ద్వారా ప్రసార భారతి-మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ)పై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. దేశంలో చలనచిత్ర, టెలివిజన్ రంగాల్లో సృజనాత్మకత ప్రాముఖ్యాన్ని గుర్తిస్తూ.. మీడియా రంగంలో ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ పోటీతత్వాన్ని ప్రోత్సహించే ఫిల్మ్, టెలివిజన్ మీడియా సమీకృత కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇరుపక్షాలు కలిసి పనిచేయనున్నాయి.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఫడ్నవీస్ మాట్లాడుతూ.. భారత వినోద రాజధాని ముంబయిలో వేవ్స్ తొలి ఎడిషన్ నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మే 1-4 తేదీల్లో ముంబయిలో నిర్వహించిన వేవ్స్ తొలి ఎడిషన్ గొప్ప విజయం సాధించిందన్నారు. క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించడానికి దేశంలో ప్రపంచస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా.. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితోనే వేవ్స్ విజయం సాధ్యమైందని శ్రీ ఫడ్నవీస్ పేర్కొన్నారు. "వేవ్స్ ఇప్పుడు ఒక ఉద్యమంగా మారింది.. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. వేవ్స్ సదస్సు క్రియేటివ్ ఎకానమీకి కొత్త ఊపునిచ్చిందన్నారు. వేవ్స్ కార్యక్రమాన్ని, క్రియేటర్స్ ఎకానమీని మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో మహారాష్ట్ర ప్రభుత్వం రూ. 150 కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఫిల్మ్ సిటీలో ఏర్పాటు కానున్న ఐఐసీటీ క్యాంపస్ ప్రపంచ స్థాయి విద్యాసంస్థగా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆకర్షించే నిర్మాణాత్మక, సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వేవ్స్ 2025లో అందరి ప్రశంసలు పొందిన భారత్ పెవిలియన్ ప్రస్తుతం ఎన్ఎమ్ఐసీలోని గుల్షన్ మహల్‌కు మారింది.. ఇది ముంబయి పర్యాటకంలో సరికొత్త సాంస్కృతిక గమ్యస్థానాన్ని జోడిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. వేవ్స్ సదస్సు సందర్భంగా మొదట 42 కంపెనీలతో, సుమారు రూ. 93,000 కోట్ల సమష్టి విలువతో ప్రకటించిన వేవ్స్ సూచీ స్వల్ప వ్యవధిలోనే రూ.1 లక్ష కోట్లు దాటిందని శ్రీ ఫడ్నవీస్ తెలిపారు. ఇది క్రియేటర్స్ ఎకానమీ వేగవంతమైన వృద్ధినీ, అపారమైన సామర్థ్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. సృజనాత్మక సాంకేతిక రంగంలో ఐఐటీలు, ఐఐఎంల స్థాయి సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కల సాకారం దిశగా ఐఐసీటీ ఏర్పాటు ఒక చారిత్రక నిర్ణయమన్నారు. క్రియేటివ్ ఎకానమీ రంగంలో పనిచేసే వ్యక్తులకు కొత్త నైపుణ్యాలు, శిక్షణ, సాధనాలను అందించడంతో పాటు ప్రపంచం లోని అత్యుత్తమ పద్ధతులను భారత్ అనుసరించేలా చేయడం చాలా ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడే సరికొత్త ఇంక్యుబేషన్లు, కొత్త ఆలోచనలు, కొత్త సాంకేతికతలు దేశీయంగా రూపొందుతాయని శ్రీ వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. తక్కువ వ్యవధిలోనే తొలి ఐఐసీటీ క్యాంపస్ ప్రారంభించుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఫిల్మ్ సిటీలో మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో తదుపరి క్యాంపస్‌ను అత్యంత సుందరంగా, వరినరాలకు అనుగుణంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఐఐసీటీ కోసం 400 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి తెలిపారు. ఐఐసీటీలో వీఎఫ్ఎక్స్, పోస్ట్-ప్రొడక్షన్, ఎక్స్ఆర్, గేమింగ్, యానిమేషన్‌లకు సంబంధించి పూర్తిగా పరిశ్రమకు అనుగుణంగా ఉండే అధునాతన కార్యక్రమాలు ఉంటాయని శ్రీ వైష్ణవ్ తెలిపారు. పరిశ్రమ-విద్యారంగాల అనుసంధాన స్ఫూర్తితో గూగుల్, మెటా, ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అడోబ్, డబ్ల్యుపీపీ వంటి సంస్థలతో ఐఐసీటీ అధికారిక ఒప్పందాలు చేసుకుందన్నారు. మొదటి బ్యాచ్‌లో 300 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగాల నిపుణులు, శిక్షకులకూ అధునాతన శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

ప్రముఖ సినీ నిర్మాత, ఐఎఫ్ఎఫ్ఐ ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీ శేఖర్ కపూర్, ప్రఖ్యాత గేయ రచయిత, సీబీఎఫ్‌సీ చైర్‌పర్సన్ శ్రీ ప్రసూన్ జోషి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ' (ఐఐసీటీ) గురించి

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ) ఈ ఆగస్టు నుంచి మొదటి బ్యాచ్ విద్యార్థుల కోసం ప్రవేశాలు ప్రారంభించనున్న క్రమంలో.. అభివృద్ధి చెందుతున్న భారత డిజిటల్, క్రియేటివ్ ఎకానమీ పరివర్తనాత్మక ముందడుగుకు రంగం సిద్ధమైంది. ఈ సంస్థ ఏవీజీసీ-ఎక్స్ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్-ఎక్స్‌టెండెడ్ రియాలిటీ) రంగంలో పరిశ్రమ ఆధారిత కోర్సుల బలమైన పోర్ట్‌ఫోలియోను అందిస్తుంది.

అద్భుతంగా కథలు చెప్పే భారత వారసత్వం.. ప్రపంచస్థాయి కంటెంట్ రూపకల్పన భవిష్యత్తులో భారత్ ముందడుగుకు సంబంధించిన వేడుకల్లో భాగంగా.. ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) 2025 కేంద్రంగా భారత్ పెవిలియన్ ఆవిర్భవించింది. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ పెవిలియన్.. భారత సాంస్కృతిక ఆత్మను.. కాలా నుంచి కోడ్ వరకు దాని డిజిటల్ పరివర్తనను అధికారికంగా ప్రదర్శిస్తుంది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆలోచనలు, నాయకత్వం ద్వారా ఏర్పాటైన ఈ భారత్ పెవిలియన్.. సృజనాత్మక రంగంలో తిరుగులేని శక్తిగా ఎదగాలనే భారత ఆకాంక్షను సూచిస్తుంది. నిర్దిష్ట రంగానికి సంబంధించిన విస్తృత అంశాలతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలు లీనమయ్యే అనుభవాన్ని అందించడమే కాకుండా.. కంటెంట్, సృజనాత్మకత, సంస్కృతి ఆధారితమైన ఆరెంజ్ ఎకానమీని పెంపొందించడం పట్ల సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. మరిన్ని వివరాల కోసం, ఇక్కడ క్లిక్ చేయండి.

### వేవ్స్ 2025 ఫలితాలు-ప్రభావాల నివేదికలు

ఆవిష్కరణలు, అమలు, ప్రపంచ భాగస్వామ్యంపై దృష్టి సారిస్తూ, వేవ్స్ వ్యవస్థలో ముఖ్య భాగంగా ఉన్న బహుళ నివేదికలు, కార్యక్రమాలను అధికారికంగా ఆవిష్కరించారు.

ఈ ప్రచురణలు భారత మీడియా-వినోద రంగ అసాధారణ చైతన్యాన్ని, వైవిధ్యాన్ని, చలనచిత్రం, టెలివిజన్, యానిమేషన్, గేమింగ్, లీనమయ్యే మీడియా, ప్రత్యక్ష కార్యక్రమాలు, సంగీతం, డిజిటల్ కంటెంట్‌ను ప్రధానంగా వివరిస్తాయి.

# మలేషియాలోని పోర్ట్ క్లాంగ్‌ను సందర్శించిన తొలి స్వదేశీ సర్వే నౌక ఐఎన్ఎస్ సంధాయక్




న్యూఢిల్లీ, జులై 19:భారత నావికాదళం స్వదేశీంగా రూపొందించి నిర్మించిన సర్వే నౌక లార్జ్ (ఎస్‌వీఎల్) ఐఎన్ఎస్ సంధాయక్ జులై 16 - 19, 2025 వరకు మలేషియాలోని పోర్ట్ క్లాంగ్‌లో తొలిసారిగా ఓడరేవుకు చేరుకుంది. ఈ సందర్శన భారత నావికాదళ హైడ్రోగ్రాఫిక్ డిపార్ట్‌మెంట్ మరియు నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్ ఫ్రేమ్‌వర్క్ కింద ప్రాంతీయ హైడ్రోగ్రాఫిక్ సామర్థ్య నిర్మాణంలో భారతదేశం యొక్క పెరుగుతున్న పాత్రను ప్రదర్శిస్తుంది.

స్వదేశీంగా రూపొందించి నిర్మించిన సంధాయక్-క్లాస్ హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌకలో మొదటిది ఐఎన్ఎస్ సంధాయక్, ఫిబ్రవరి 2024లో కమిషన్ చేయబడింది ఈ నౌక పూర్తి స్థాయి తీరప్రాంత మరియు లోతైన నీటి సర్వే సామర్థ్యం, సముద్ర శాస్త్ర డేటా సేకరణను కలిగి ఉంది మరియు ఆన్‌బోర్డ్ హెలికాప్టర్ మరియు ఆసుపత్రి విధులతో శోధన మరియు రెస్క్యూ (ఎస్ఏఆర్)/మానవతా కార్యకలాపాలను నిర్వహించగలదు.

క్లాంగ్ పోర్టుకు ఓడ యొక్క తొలి సందర్శన సాంకేతిక మార్పిడిని సులభతరం చేయడం మరియు సర్వే సాంకేతికతలను పంచుకోవడం మరియు స్థిరమైన హైడ్రోగ్రాఫిక్ మద్దతు నిశ్చితార్థాలు వంటి సమిష్టి సహకారం ద్వారా సంస్థాగత సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ పర్యటన సందర్భంగా జరిగే ముఖ్యమైన కార్యకలాపాలలో అంతర్జాతీయ సద్భావనను పెంపొందించడానికి మరియు మహాసాగర్ (ప్రాంతాలలో భద్రత మరియు వృద్ధి కోసం పరస్పర మరియు సమగ్ర పురోగతి) దృక్పథంపై అవగాహన పెంచడానికి రూపొందించిన లోతైన జ్ఞాన మార్పిడి సెషన్లు, అధికారిక స్వాగతాలు మరియు కార్యక్రమాలు ఉన్నాయి. ఈ పర్యటన ప్రాంతీయ సముద్ర సహకారానికి భారతదేశం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

# రోమ్‌లో జరిగిన 88వ కోడెక్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో భారతదేశ మిల్లెట్ ప్రమాణానికి గుర్తింపు లభించింది..

న్యూఢిల్లీ, జులై 19:గత సంవత్సరం కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ సమయంలో ఆమోదించబడిన తృణధాన్యాల కోసం సమూహ ప్రమాణాన్ని అభివృద్ధి చేయడంలో భారతదేశం యొక్క నాయకత్వాన్ని, 2025 జులై 14 నుండి 18 వరకు ఇటలీలోని రోమ్‌లోని ఈఫా ప్రధాన కార్యాలయంలో జరిగిన కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ యొక్క ఎగ్జిక్యూటివ్ కమిటీ యొక్క 88వ సెషన్ సందర్భంగా ప్రశంసించారు. భారతదేశం అధ్యక్షత వహిస్తున్న ఈ పని పురోగతిని కమిటీ సమీక్షించింది, దీనికి మాలి, నైజీరియా మరియు సెనెగల్ సహ-అధ్యక్షులుగా ఉన్నాయి. దీనికి సంబంధించిన నిబంధనలను ఏప్రిల్ 2025లో జరిగిన తృణధాన్యాలు, పప్పుధాన్యాలు మరియు చిక్కుళ్ళు పై కోడెక్స్ కమిటీ 11వ సెషన్‌లో ఖరారు చేశారు.కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికైన సభ్యుడిగా భారతదేశం, ఈఫా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మరియు క్యాబినెట్ డైరెక్టర్ శ్రీ గాడ్‌ఫ్రే మాగ్వెం జీ మరియు హెల్త్ ప్రమోషన్ అండ్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జెరె మీ ఫర్రార్ ప్రారంభించిన సెషన్‌లో పాల్గొంది. ఈ కార్యక్రమం లో కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ అలన్ అజెగెలే, కమిషన్ కార్యదర్శి శ్రీమతి సారా కాహిల్ మరియు సభ్య దేశాల నుండి ఎన్నికైన ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచిత చేప పిల్లలు వద్దు...సొసైటీలకు నగదు ఇవ్వండి...

**- కోమట్లగూడెం సొసైటీ మత్స్యశాఖ అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు**

ఖమ్మం, జులై 19 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ కాంట్రాక్టర్ల ద్వారా అందించడంతో నాణ్యమైన చేప పిల్లలు రావడంలేదని కోమట్లగూడెం సొసైటీ మత్స్యశాఖ అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం వారు మాటాడుతూ...చేప పిల్లల పంపిణీ కార్యక్రమం కాకుండా ఆయా సొసైటీలకు నగదును అందిస్తే నాణ్యమైన చేప పిల్లలను ఆయా చెరువులు, కుంటల్లో పెంచడం ద్వారా ఆర్థికంగా ముదిరాజ్ కులస్తులు, మత్స్యకారులు ప్రయోజనం పొందుతారని వారు తెలిపారు. ప్రభుత్వం ముదిరాజులకు లబ్ధి చేకూర్చే విధానంలో ఒక గొప్ప ప్రతిష్ఠాత్మకమైన నిర్ణయం తీసుకోని ఉచిత చేప పిల్లల పథకం ముందుకు పోతుంటే దానిని కొందరు కాంట్రాక్టర్లు వారి స్వలాభం కోసం నాణ్యతలేని, నాసిరకం చేప పిల్లలను మత్స్యకారులకు సరఫరా చేస్తున్నారన్నారు. గత సంవత్సరం అసెంబ్లీ వేదికగా చాలా విమర్శలు వచ్చాయని ఈ సారి ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల పట్ల చొరవ చూపి ఉచిత చేప పిల్లలకు బదులు నేరుగా సహకార సంఘాలకు నగదు బదిలీ చేస్తే మంచి నాణ్యతతో కూడిన చేప పిల్లలను తెచ్చి చెరువులు, కుంటలలో పోసుకుంటామని ప్రభుత్వాన్ని కోరారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే ఏడాది నుంచే ఉత్పత్తులు- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



హన్మకొండ, జులై 19: కాజీపేట మెగాకోచ్ ఫ్యాక్టరీ పనులను డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని, 2026 లో ఇక్కడి నుండి కోచ్ ల ఉత్పత్తి ప్రారంభిస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో కాజీపేట నుండి 150 లోకోమోటివ్ లు కూడా ఎగుమతి అవుతాయని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ను నేడు కేంద్ర మంత్రి పరిశీలించారు..

ముందుగా శంకర్ పల్లి రైల్వే స్టేషన్ నుండి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు రైలు మార్గంలో ప్రయాణించి, అనంతరం కోచ్ ఫ్యాక్టరీని నిర్మాణ స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలో 750 కోట్ల రూపాయలతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తెలంగాణలో ఇదో పెద్ద ప్రాజెక్టు అని చెప్పిన కేంద్రమంత్రి.. ఈ ప్రాజెక్ట్ వల్ల చాలా మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. దేశంలోనే ఇది పెద్ద రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ అని.. వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారవుతాయని మంత్రి వెల్లడించారు.

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు పురోగమిస్తున్నాయని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో రైల్వే అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు.

కాజీపేట మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తెలంగాణ ప్రజల చాలా ఏళ్ల కల అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 'ఇక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేర్చాం. ఇక్కడ భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. వాళ్ల సిఫార్సు మేరకు ఉద్యోగాలు కల్పిస్తాం. మోదీ చేస్తున్న అభివృద్ధి.. కళ్లున్న వాళ్లు చూడాలి, చెవులన్న వాళ్లు వినాలి. లేదంటే ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకోండి. మామునూరు ఎయిర్ పోర్ట్ కోసం భూములు ఎంత త్వరగా అప్పగిస్తే అంత త్వరగా ఎయిర్ పోర్ట్ లో విమానాలు ఎగురుతాయి' అని కిషన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచందర్ రావ్, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి , ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మ్మెల్యేలు పాల్వాయి హరీష్ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం
సౌజన్యంతో
అమరవాది ఫౌండేషన్
సాహిత్య, సాంస్కృతిక, బాల వికాస సంస్థ, హైదరాబాద్
శ్రీమతి అమరవాది హైమవతీ-డా. ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీమతి శీలా సుభద్రాదేవి
డా. ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : డా. అమ్మిన శ్రీనివాస రాజు
డా. అమరవాది నీరజ — అంజు — బాలల బొమ్మల కథా పుస్తకం
డా. పత్తిపాక మోహన్ — తెలుగు బాల గీతాల హిందీ అనువాదం — హారే బరే గీత్ అను: డా. షేక్ అబ్దుల్ ఘనీ
శ్రీ గరిపెల్లి అశోక్ — గోటీలాట — బాలల కథా సంపుటి
పుస్తకాల ఆవిష్కరణ - బాలల కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం
27 జూన్, 2025 ఆదివారం, మధ్యాహ్నం గం. 2.30 నుండి 4.30 వరకు
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్
సభాధ్యక్షులు
డా. పత్తిపాక మోహన్
దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, విద్యా మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం
ముఖ్య అతిథి
ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
పూర్వాధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం & అఖిల భారత, జా.సా.ప.
జ్యోతి ప్రకాశనం
శ్రీమతి మాడభూషి లలితా దేవి
అధ్యక్షులు, డా. మాడభూషి రంగాచార్య స్మారక సమితి
అమరవాది ఫౌండేషన్ పక్షాన
డా. అమరవాది నీరజ (అధ్యక్షులు) ఎ. సీతారాం (ఉపాధ్యక్షులు) చింతకింది మాల్య్వ (ప్రధాన కార్యదర్శి) డా. హారిక చెరుకుపల్లి (నిర్వాహక కార్యదర్శి)

# రామయ్య సన్నిధిలో సీనియర్ ఐఏఎస్.. భద్రగిరీశునికి రామ్‌సుందర్‌రెడ్డి పూజలు



భద్రాచలం, జులై 19: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి , ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ రామ్‌సుందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తొలుతగా శనివారం ఆలయానికి విచ్చేసిన రామ్‌సుందర్ రెడ్డికి ఆలయ లాంఛనాలతో మేళతాళాలతో ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చక స్వాములు రామ్‌సుందర్ రెడ్డికి ఆలయ విశిష్టత, చరిత్రను తెలియజేశారు. అమ్మవారి సన్నిధిలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అంతః సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను, శేషవస్త్రాలను రామ్‌సుందర్ రెడ్డి దంపతులకు అందించటం జరిగింది. ఈ క్రమంలో ఆలయంలోని స్వామివారి ఉత్సవమూర్తులను, కంచర్ల గోపన్న చేయించిన స్వామివారి నగలను, అద్దాల మండపాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రావణ్ కుమార్, అర్చక స్వాములు, పోలవరం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జైన మాన్యుస్క్రిప్టాలజీపై జాతీయ వర్క్‌షాప్ మైనారిటీ వారసత్వాన్ని కాపాడటానికి ప్రభుత్వ నిబద్ధతను ప్రదర్శిస్తుంది

న్యూఢిల్లీ, జులై 19:భారతదేశ నాగరికత లోతు మరియు సమ్మిళిత సాంస్కృతిక విధానాన్ని హైలైట్ చేసే ఒక మైలురాయి చొరవలో, అధునాతన పరిశోధన ద్వారా ఇండిక్ నాలెడ్జ్ వాలిడేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జైన మాన్యుస్క్రిప్టాలజీ ప్రాముఖ్యతపై జాతీయ వర్క్‌షాప్ ఈరోజు అహ్మదాబాద్‌లోని గుజరాత్ విశ్వవిద్యాలయంలో జరిగింది.

భారత ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమ్ నిధులతో, జైన మాన్యుస్క్రిప్ట్‌లలో పొందుపరచబడిన లోతైన మేధో మరియు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అన్వేషించడానికి మరియు జరుపుకోవడానికి ఈ వర్క్‌షాప్ ప్రముఖ పండితులు, జైన సన్యాసులు, విద్యావేత్తలు మరియు అధికారులను ఒకచోట చేర్చింది.

ఈ కార్యక్రమానికి జైన తత్వశాస్త్రం మరియు ప్రాకృత సాహిత్యంలో అత్యున్నత ప్రావీణ్యం కలిగిన శ్రీ సునీల్ సాగర్ మహారాజ్ హాజరయ్యారు, ఆయన ఉనికి మరియు ఆశీస్సులు వర్క్‌షాప్ యొక్క విద్యా వాతావరణాన్ని బాగా సుసంపన్నం చేశాయి.

ముఖ్య అతిథిగా ముఖ్యోపన్యాసం చేస్తూ, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్ర శేఖర్ కుమార్, సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలు మరియు మైనారిటీ వారసత్వ భాషల పరిరక్షణ, పునరుజ్జీవనం మరియు వ్యాప్తికి ప్రభుత్వం యొక్క అచంచలమైన నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆయనతో పాటు జాయింట్ సెక్రటరీ శ్రీ రామ్ సింగ్ మరియు డిప్యూటీ సెక్రటరీ శ్రీ శ్రావణ్ కుమార్, పురాతన భారతీయ సంప్రదాయాల పరిశోధన మరియు ధృవీకరణను ప్రోత్సహించడంలో మంత్రిత్వ శాఖ యొక్క చురుకైన కృషిని హైలైట్ చేశారు.

"మన మైనారిటీ వర్గాల విస్తారమైన మరియు విభిన్నమైన మేధో సంప్రదాయాలను వెలుగులోకి తెచ్చే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి భారత ప్రభుత్వం గర్వంగా ఉంది. ఈ సంప్రదాయాలను కాపాడుకోవడం మన గతాన్ని గౌరవించడమే కాకుండా సాంస్కృతికంగా సుసంపన్నమైన భవిష్యత్తుకు పునాదిని కూడా బలపరుస్తుంది" అని డాక్టర్ కుమార్ అన్నారు.

ఈ వర్క్‌షాప్ ప్రభుత్వం పురాతన జ్ఞానాన్ని సమకాలీన విద్యా మరియు సాంస్కృతిక చట్రాలలో అనుసంధానించడానికి, సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలు సంరక్షించబడటమే కాకుండా భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా మరియు సంబంధితంగా ఉండేలా చూసుకోవడానికి ప్రభుత్వం యొక్క వ్యూహాత్మక కృషికి నిదర్శనంగా పనిచేస్తుంది.

# వ్యర్థాలతో ఎనర్జీ .. సద్వినియోగం చేసుకోవాలన్న చంద్రబాబు



తిరుపతి, జులై 19: తిరుపతిలో ఇంత మంచి వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ ఉందనే విషయం మీరు నాకు చెప్పలేదు. నేను కూడా మరిచిపోయాను. ఇటువంటి ప్లాంట్ ఉపయోగించుకుని రాష్ట్రంలో ఫంక్షనల్ సర్కులర్ ఎకానమి సెంటర్ ఏర్పాటు చేయవచ్చు అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన శనివారం మధ్యాహ్నం రేణిగుంట సమీపంలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహించే తూకివాకం ప్రాంతంలో దాదాపు 300 ఎకరాల విస్తీర్ణం లోని డ్రై వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్( ప్లాట్ ను ), బయో మిథనైజేషన్ గ్యాస్ ప్లాంట్, భవన నిర్వహణ వ్యర్థాల తదితర యూనిట్లను పరిశీలించారు. దాదాపు అరగంట కు పైగా ఆ ప్లాంట్ ల పనితీరును పరిశీలించిన చంద్రబాబు సంబంధిత వివరాలను, భవిష్యత్ ప్రణాళికలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు డ్రై వేస్ట్ విక్రయాల ద్వారా, మిథేన్ గ్యాస్ విక్రయాల ద్వారా వస్తున్న ఆదాయాన్ని గురించి తెలుసుకున్నారు. ఇక్కడి ప్లాంట్ నుంచి 22 టన్నుల ఆర్గానిక్ వేస్ట్ నుంచి 750 కేజీ ల బయో గ్యాస్ ఉ త్పత్తి అవుతోందని, ఆ గ్యాస్ ను హోటళ్ల కు కేజీ రూ 76 కు విక్రయిస్తున్నామని అధికారులు వివరించారు.

ఇక్కడి ప్లాంట్ లో రీ సైకిల్ చేస్తున్న వ్యర్థ జలాలను తాగ దానికి కూడా వినియోగిస్తున్న సింగపూర్ మోడల్ తరహా ప్రయత్నాలు చేయాలని నిర్దేశించారు. తిరిగి వెళ్ళేటప్పుడు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తో మాట్లాడుతూ వైజాగ్ లో ఇటువంటి ప్లాంట్ ఉందని తెలుసు కానీ తిరుపతి లో ఇంత మంచి మోడల్ నా దృష్టికి తీసుకురాలేదు అన్నారు ఇదంతా 2016. 2017 మధ్యకాలంలో తిరుపతి స్మార్ట్ సిటీ పనుల కింద చేపట్టింది అని చెప్పగా మీరు చెప్పలేదు నేను కూడా మరిచిపోయాను అని అన్నారు. ఇటువంటి ప్లాంట్ లను పెద్ద ఆదాయ వనరులుగా ఉపయోగించుకోవచ్చునని అంటూ ముఖ్యంగా బయో గ్యాస్ ను కొనుక్కునే హోటళ్ల వంటి సముదాయాల నుంచి వెజిటబుల్ వేస్ట్ తీసుకుని, వారికి గ్యాస్ ఇచ్చేవిధంగా బై బ్యాక్ విధానంలో లబ్ది పొందవచ్చునని అన్నారు. ప్లాంట్ కు తగినంత వేస్ట్ కావాలంటే 40 ? 50 కిలోమీటర్ల పరిధి నుంచి సేకరించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇటువంటి వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ ల ద్వారా రాష్ట్రంలో ఫంక్షనల్ సర్కులర్ ఎకానమి సెంటర్ ని ఏర్పాటు చేయవచ్చినని, ఆ కోణంలో ఆలోచన చేయాలని మంత్రి నారాయణకు ఇతర అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణతో పాటు శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, మునిసిపల్ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు

కపిలతీర్థంలో పూజలు ..

పర్యటనలో భాగంగా ఆయన తిరుపతి కపిలతీర్థం చేరుకుని అక్కడ కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడే స్వచ్ఛాంధ్ర భాగస్వాములతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత అలిపిరి వద్ద ఉన్న కంచి కామకోటి పీఠం మఠానికి చేరుకుని కంచి స్వాములతో సమావేశమవుతారు చంద్రబాదు .

రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం

తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం నేటి శనివారం ఉదయం 11.42 గం.లకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబుకి ఘన స్వాగతం లభించింది. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి , జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, డీఐజీ షిమోషి బాజ్ పాయ్, జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ , ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశ, తిరుపతి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, నగిరి, వెంకటగిరి ఎమ్మెల్యే లు ఆరని శ్రీనివాసులు, ఆదిమూలం, నెలవల విజయశ్రీ , పాశం సునీల్ కుమార్, భాను ప్రకాష్, కె. రామకృష్ణ, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి, జేడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్,రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్, ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్స్ చైర్మన్ సుగుణమ్మ, తుడ చైర్మన్ దాలర్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బి జె పి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ఇర ముఖ్య మంత్రి వర్యులకు విమానాశ్రయం వెలుపల కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికారు. ముఖ్య మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ అర్జీదారుల నుండి అర్జీలు తీసుకొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదును చూదాలన్న ఉత్సాహంతో పొరపాటున కాలుజారి కాలువలో పడిన వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంట చేరుకున్న చంద్రబాబు ను చూడదానికి ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఓ కార్యకర్త కాలువపై ముఖ్యమంత్రిని చూడదానికి కాలువపై వస్తుండగా కాలువపై ఉన్న బండ విరిగి పోవదంతో కిందపడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన అధికారులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# అల్లూరి ఏజెన్సీలో హత్యల కలకలం



హైదరాబాద్, జులై 19:రోజువారీ ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదనే అక్కసుతో అమ్మానాన్నను అతి కిరాతకంగా ఓ కొడుకు గొడ్డలితో నరికి చంపిన ఘటన సభ్య సమాజాన్ని కలవరపెట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం చౌడకోట పంచాయతీ పరిధిలోని తుర్రవాడ గ్రామంలో దారుణ ఘటన చోటు చేసుకుంది.

వివరాలు ఇలా ఉన్నాయి. అందాల సన్యాసిరెడ్డి (56), అందాల బోడమ్మ (53 ) గిరిజన దంపతులు కొండపోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఊరికి దూరంగా ఉన్న తుర్రం కొండ చేను వద్ద నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.

రోజువారి జీవనశైలిలో భాగంగా కొండపోడు వ్యవసాయం ముగించుకుని చేనుపాక వద్ద ఉండగా కొడుకు అందాల మల్లి రెడ్డి తన అవసరాలు నిమిత్తం డబ్బులు ఇవ్వడం లేదని శుక్రవారం సాయంత్రం తగాదా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు అందాల సన్యాసిరెడ్డి (56), అందాల బోడమ్మ (53)లను మల్లి రెడ్డి అర్ధరాత్రి అతి కిరాతకంగా గొడ్డలితో నరికివేశాడు. అమ్మానాన్న ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

తెల్లవారుజామున తుర్రవాడ గ్రామస్తులకు ఈ విషయం తెలిసింది. ఘటనా స్థలికి చేరుకున్నారు. మల్లి రెడ్డి గత కొన్నాళ్లుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు. మారేడుమిల్లి ఎస్ఐ శ్రీనివాస్ రావు కేసు దర్యాప్తు ప్రారంభించారు.






# బీహార్లోని మోతీహారిలో రూ.7,000 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జులై 19:బీహార్‌లోని మోతీహారీలో రూ. 7,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసి, పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా బాబా సోమేశ్వరనాథ్‌కు నమస్సులు అర్పిస్తూ.. బీహార్ ప్రజల జీవితాల్లో సంతోషం, సంక్షేమం నిండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సభను ఉద్దేశించి శ్రీ మోదీ ప్రసంగిస్తూ.. చరిత్ర గతిని మార్చిన భూమి... చంపారన్ అనీ, స్వాతంత్ర్యోద్యమ కాలంలో మహాత్మాగాంధీకి ఈ నేల కొత్త దిశను చూపించిందని చెప్పారు. ఈ నేల అందించిన స్ఫూర్తే ఇప్పుడు బీహార్ భవిష్యత్తును తీర్చిదిద్దుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సమావేశానికి హాజరైన వారికి, బీహార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

21వ శతాబ్దం వేగవంతమైన ప్రపంచాభివృద్ధిని చూస్తోందని శ్రీ మోదీ అన్నారు. ఒకప్పుడు పాశ్చాత్య దేశాల ఆధిపత్యమే ఉండేదని ఇప్పుడు తూర్పు దేశాల భాగస్వామ్యం, ప్రభావం పెరుగుతోందని వెల్లడించారు. అభివృద్ధిలో తూర్పు దేశాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని స్పష్టం చేశారు. తూర్పు దేశాలు అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్నట్టే.. వాటికి సమాంతరంగా భారత్‌లో తూర్పు రాష్ట్రాల యుగం మొదలైందని అన్నారు. తూర్పున ఉన్న మోతీహారీని పశ్చిమాన ముంబయిలానే ప్రాధాన్య నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించుకుందని తెలియజేశారు. గురుగ్రామ్ మాదిరిగానే గయలోనూ సమాన అవకాశాలు, పుణే తరహాలో పాట్నాలో పారిశ్రామిక అభివృద్ధి, సూరత్‌తో సమానంగా సంతాల్ పరగణా అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి తెలిపారు. పర్యాటకంలో జల్పాయ్‌గురి, జాజ్పూర్ ప్రాంతాలు జైపూర్ తరహాలో కొత్త రికార్డులు సృష్టిస్తాయని ఆకాంక్షించారు. బీర్భూమ్ ప్రజలు బెంగళూరులో ఉన్నవారిలాగా ప్రగతిని సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

“తూర్పు భారత్‌ను ముందుకు తీసుకెళ్లాలంటే.. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా బీహార్‌ను మార్చాలి” అని శ్రీ మోదీ అన్నారు. బీహార్లో వేగంగా సాగుతున్న అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉండటమే కారణమని పేర్కొన్నారు. సహకారంలో భేదాన్ని వివరించడానికి ఆయన డేటాను ఉటంకించారు: కేంద్రంలో గత ప్రభుత్వాలు అధికారంలో ఉన్న పదేళ్లలో బీహార్‌కు కేవలం రూ. 2 లక్షల కోట్లే అందాయి. దీనిని నితీష్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వంపై రాజకీయంగా కక్ష్య సాధించే చర్యగా వర్ణించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత తన ప్రభుత్వం బీహార్‌పై ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలకు స్వస్తి పలికిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. తమ పదేళ్ల పాలనలో బీహార్ అభివృద్ధికి రూ.9 లక్షల కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఇది మునుపటి ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పోలిస్తే నాలుగు రెట్ల కంటే ఎక్కువ అని పేర్కొన్నారు. ఈ నిధులు బీహార్ వ్యాప్తంగా ప్రజాసంక్షేమానికి, అభివృద్ధి ప్రాజెక్టులకు ఉపయోగిస్తున్నామని హామీ ఇచ్చారు.

రెండు దశాబ్దాల కిందట బీహార్ ఎదుర్కొన్న నిరాశను నేటి తరం అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. గత ప్రభుత్వాల పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని, పేదవారికి ఉద్దేశించిన నిధులు వారి వరకు చేరడం అసాధ్యమయ్యేదనీ, పేదల నుంచి ధనాన్ని దోచుకోవడంపైనే అప్పటి నాయకత్వం దృష్టి సారించిందని విమర్శించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే భూమిగా బీహార్‌ను వర్ణిస్తూ.. ఆ రాష్ట్ర ప్రజల సామర్థ్యాన్ని ప్రశంసించారు. సంక్షేమ పథకాలు పేదలకు నేరుగా అందేలా గత పాలకుల సంకెళ్లను తెంచుకుని బీహార్‌కు విముక్తి కల్పించిన ప్రజలను మెచ్చుకున్నారు. గడచిన 11 ఏళ్లలో దేశ వ్యాప్తంగా పీఎం ఆవాస యోజన కింద 4 కోట్లకు పైగా ఇళ్లు నిర్మించారని శ్రీ మోదీ తెలిపారు. వాటిలో 60 లక్షలు బీహార్‌లోనే నిర్మాణమయ్యాయనీ, ఈ సంఖ్య నార్వే, న్యూజిలాండ్, సింగపూర్ లాంటి దేశాల మొత్తం జనాభాను అధిగమించిందని అన్నారు. “మోతీహారీ జిల్లాలోనే దాదావు 3 లక్షల కుటుంబాలకు పక్కా ఇళ్లు లభించాయి. ఈ సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ ప్రాంతంలోని 12,000 కు పైగా కుటుంబాలు ఈ రోజు కొత్త ఇంటి తాళాలు అందుకుంటున్నాయి” అని శ్రీ మోదీ తెలిపారు. అదనంగా, మరో 40,000 పేద కుటుంబాలు పక్కా ఇళ్లను నిర్మించుకోవడానికి అవసరమైన నిధులను నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా పొందాయి. వీరిలో ఎక్కువ మంది దళితులు, మహాదళితులు, వెనకబడిన వర్గాల వారే ఉన్నారనీ, గత ప్రభుత్వ పాలనలో ఈ తరహా గృహాలను పేదలు పొందగలగడం ఊహకు అందని విషయమని అన్నారు. వారి పాలనలో ప్రజలు తమ ఇళ్లకు రంగులు వేసుకోవడానికి కూడా భయపడేవారని, భూస్వాములు తమను లక్ష్యంగా చేసుకుంటారని ఆందోళన చెందేవారని గుర్తు చేసుకున్నారు. అప్పటి పాలక పార్టీకి చెందిన నాయకులు ప్రజలకు పక్కా ఇళ్లు అందించలేకపోయారని ఆయన తెలియజేశారు.

బీహార్ పురోగతికి ఆ రాష్ట్రానికి చెందిన తల్లులు, సోదరీమణుల సామర్థ్యం, దృఢ సంకల్పవే కారణమని శ్రీ మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి చర్య ప్రాధాన్యాన్ని బీహార్‌లోని మహిళలు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు. సమావేశానికి హాజరైన మహిళలను ఉద్దేశించి.. గతంలో బ్యాంకు ఖాతాలు, బ్యాంకుల్లోకి అనుమతి లేకపోవడం వల్ల రూ.10ని సైతం దాచుకోవాల్సి వచ్చిన రోజులను గుర్తు చేసుకున్నారు. పేదల గౌరవాన్ని తాను అర్థం చేసుకున్నానని ప్రధానమంత్రి తెలియజేశారు. అణగారిన వర్గాల వారికి బ్యాంకులు తమ తలుపులను ఎందుకు మూసి ఉంచుతున్నాయో తాను ప్రశ్నించిన విధానాన్ని గుర్తు చేశారు. జన ధన్ ఖాతాలను తెరిచేందుకు ప్రారంభించిన ప్రచారం ద్వారా మహిళలే ఎక్కువ లబ్ది పొందారనీ, బీహార్లో ఇపుడు 3.5 కోట్ల మంది మహిళలకు జన్ ధన్ ఖాతాలు ఉన్నాయని వెల్లడించారు. ఇప్పుడు ప్రభుత్వ పథకాల నిధులు నేరుగా వారి ఖాతాల్లోకే బదిలీ అవుతున్నాయని శ్రీ మోదీ తెలియజేశారు. శ్రీ నితీష్ కుమార్ సారథ్యంలోని బీహార్ ప్రభుత్వం ఇటీవలే వయోధికులు, దివ్యాంగులు, వితంతువులకు అందించే నెలవారీ పెన్షన్ ను రూ. 400 నుంచి 1,100 కు పెంచారని ప్రస్తావించారు. ఈ మొత్తం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతోందని అన్నారు. గడచిన నెలన్నర కాలంలోనే బీహార్లోని 24,000 స్వయం సహాయక బృందాలకు రూ.1,000 కోట్లకు పైగా లబ్ధి పొందాయని, ఇది జన్ ధన్ ఖాతాల ద్వారా తల్లులు, సోదరీమణులకు అందించిన ఆర్థిక సాధికారతే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా, బీహార్‌లోనూ ‘లఖ్‌పతి దీదీల’ సంఖ్య పెరుగుతూ ఉందన్న ప్రధానమంత్రి.. మహిళా సాధికారత కార్యక్రమాలు సాధిస్తున్న శక్తిమంతమైన ఫలితాలకు ఇది నిదర్శనమన్నారు. 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేసే ఈ జాతీయ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 1.5 కోట్ల మంది మహిళలు ఈ మైలురాయిని సాధించారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. బీహార్‌లో 20 లక్షలకు పైగా మహిళలు లఖ్‌పతి దీదీలుగా మారారని.. కేవలం చంపారన్‌లోనే 80,000 మందికి పైగా మహిళలు స్వయం సహాయక బృందాల్లో చేరి లక్షాధికారులయ్యారని ఆయన వివరించారు. నారీ శక్తిని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కమ్యూనిటీ పెట్టుబడి నిధిగా రూ. 400 కోట్లు విడుదల చేస్తున్నట్లు శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించారు. శ్రీ నితీష్ కుమార్ ప్రారంభించిన “జీవిక దీదీ” పథకాన్ని ఆయన ప్రశంసించారు. బీహార్‌లోని లక్షలాది మంది మహిళలు స్వావలంబన సాధించేందుకు ఈ పథకం మార్గం సుగమం చేసిందని ప్రధానమంత్రి కొనియాడారు.

‘భారత పురోగతి కోసం బీహార్ పురోగతి చాలా అవసరం’ అనే తమ పార్టీ దార్శనికతను పునరుద్ఘాటిస్తూ.. బీహార్ యువత పురోగమించినప్పుడే రాష్ట్రం ముందుకు సాగుతుందని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. సంపన్న బీహార్.. యువతకు ఉపాధి కల్పించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. బీహార్ లోనే ఉపాధి అవకాశాలను సృష్టించడానికి ఇటీవలి సంవత్సరాల్లో గణనీయమైన ప్రయత్నాలు జరిగాయన్న ప్రధానమంత్రి.. పూర్తి పారదర్శకతతో లక్షలాది మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు అందించిన శ్రీ నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. బీహార్ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో బీహార్ ముఖ్యమంత్రి సరికొత్త ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రయత్నాలకు అండగా ఉంటుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు.

ప్రైవేట్ రంగంలో తొలిసారిగా ఉద్యోగం పొందే వారికి మద్దతునిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఒక ముఖ్యమైన పథకాన్ని ఆమోదించిందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ పథకం కింద ప్రైవేట్ కంపెనీలో తొలిసారిగా నియామకం పొందే యువతకు కేంద్ర ప్రభుత్వం రూ. 15,000 మంజూరు చేస్తుందన్నారు. ఆగస్టు 1 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు కోసం కేంద్రం రూ. 1 లక్ష కోట్ల ఖర్చు చేస్తుందన్న ప్రధానమంత్రి.. ఈ కార్యక్రమం బీహార్ యువతకు గణనీయ ప్రయోజనం చేకూరుస్తుందని స్పష్టం చేశారు. ముద్ర యోజన వంటి పథకాల ద్వారా బీహార్‌లో స్వయం ఉపాధిని ప్రోత్సహించిన ప్రయత్నాలను కూడా శ్రీ నరేంద్ర మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. గత రెండు నెలల్లోనే బీహార్‌లో ముద్ర యోజన కింద లక్షలాది రుణాలు పంపిణీ అయ్యాయనీ, ప్రత్యేకించి చంపారన్‌లో 60,000 మంది యువత తమ స్వయం ఉపాధి ప్రణాళికల కోసం ముద్ర రుణాలు పొందినట్లు తెలిపారు.

ఇతర పార్టీల నాయకులు, ముఖ్యంగా ఉద్యోగాలు ఇస్తామంటూ ఆశజూపి ప్రజల భూమిని ఆక్రమించే నాయకులు ఎప్పటికీ ఉపాధి కల్పించలేరని శ్రీ నరేంద్ర మోదీ విమర్శించారు. లాంతర్ల యుగానికీ.. కొత్త ఆశలతో ప్రకాశించే నేటి బీహార్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తుంచుకోవాలని ప్రజలను కోరారు. ఈ పరివర్తన బీహార్ సంకీర్ణ ప్రభుత్వం సాధించిన ఘనతగా ఆయన అభివర్ణించారు. తమ సంకీర్ణ ప్రభుత్వానికి బీహార్ ప్రజలు బలమైన మద్దతుని వ్వడంతో పాటు, మా ప్రభుత్వంపై అంచచలమైన విశ్వాసం ఉంచారని ప్రధానమంత్రి కొనియాడారు.

ఇటీవల నక్సలిజం నిర్మూలన కోసం చేపట్టిన నిర్ణయాత్మక చర్యలను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. బీహార్ యువతకు దీని ద్వారా ఎంతో మేలు జరిగింద న్నారు. ఒకప్పుడు మావోయిస్టు ప్రభావంతో వెనకబడిన చంపారన్, ఔరంగాబాద్, గయ, జముయి వంటి జిల్లాల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం కనిపిస్తోందన్నారు. మావోయిస్టు హింస కారణంగా అభివృద్ధికి దూరమైన ప్రాంతాల యువత ఇప్పుడు పెద్ద కలలు కంటున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. నక్సలిజం నుంచి దేశానికి పూర్తిగా విముక్తి కల్పించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

ఇది నవ భారత్ నేల నుంచీ, ఆకాశం నుంచీ మన సైనికులు విరుచుకుపడం ఖాయం. శత్రువులను శిక్షించే విషయంలో ఏ చిన్న ప్రయత్నాన్నీ వదిలేది లేదు” అని శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించాలన్న నిర్ణయాన్ని తీసుకున్నది బీహార్ గడ్డమీద నుంచేనని గుర్తు చేశారు. ఈ రోజు ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రపంచమంతా చూస్తోందని ఆయన పేర్కొన్నారు.

సామర్థ్యం, వనరులు లేని రాష్ట్రంగా బీహార్ ఉండేదన్న ప్రధానమంత్రి.. నేడు ఇక్కడి వనరులే ఈ రాష్ట్ర పురోగతికి సాధనాలుగా మారుతున్నాయన్నారు. తమ ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా మఖానా ధరలు పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ... మఖానా రైతులను పెద్ద మార్కెట్లతో అనుసంధానించడమే దీనికి కారణమని పేర్కొన్నారు. ఈ రంగానికి మరింత ఊతమిచ్చే మఖానా బోర్డు ఏర్పాటునూ ప్రస్తావించారు. అరటి, లిచీ, మిర్చా బియ్యం, కతర్నీ బియ్యం, జర్దాలు మామిడి, మాఘాయ్ పాన్ వంటి పంటలు బీహార్ వ్యవసాయ సంపదకు చక్కని ఉదాహరణలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ పంటలే కాకుండా అనేక ఇతర ఉత్పత్తులు బీహార్ రైతులను, స్థానిక యువతను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానిస్తున్నాయని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

రైతుల దిగుబడిని, ఆదాయాన్ని పెంచడం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద దేశవ్యాప్తంగా రైతులకు సుమారు రూ. 3.5 లక్షల కోట్లు పంపిణీ చేశామన్నారు. మోతీహారిలోనే 5 లక్షలకు పైగా రైతులు ఈ పథకం ద్వారా రూ. 1,500 కోట్లకు పైగా మొత్తాన్ని అందుకున్నారని ప్రధానమంత్రి వివరించారు.

తమ ప్రభుత్వం కేవలం నినాదాలు.. వాగ్దానాలకే పరిమితం కాదనీ, కార్యాచరణ ద్వారా ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. వెనకబడిన, అత్యంత వెనకబడిన వర్గాల అభ్యున్నతి పట్ల తమ ప్రభుత్వ నిబద్ధత.. మా ప్రభుత్వ విధానాలు, నిర్ణయాల్లో ప్రతిబింబిస్తుందన్నారు. వెనకబడిన ప్రాంతాలు, వెనకబడిన తరగతుల అభివృద్ధి విషయంలో తమ లక్ష్యం సుస్పష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలనింటిలోనూ వారికి ప్రాధాన్యం ఉంటుందన్న ప్రధానమంత్రి.. వారి అభివృద్ధి ధ్యేయంగానే అనేక పథకాలు రూపొందిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా 110కి పైగా జిల్లాలు వెనకబడి, నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్న ప్రధానమంత్రి.. తమ ప్రభుత్వం ఈ జిల్లాలను ఆకాంక్షాత్మక జిల్లాలుగా ప్రకటించి, అభివృద్ధి దిశగా నడిపించడం ద్వారా తగిన ప్రాధాన్యమిచ్చిందన్నారు. భారత సరిహద్దు గ్రామాలు కూడా చాలా కాలంగా “మారుమూల గ్రామాలు”గా పరిగణించడంతో వెనకబడ్డాయనీ, తమ ప్రభుత్వం వాటిని “మొదటి ప్రాధాన్య గ్రామాలు”గా గుర్తించి ఆయా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఓబీసీ వర్గం చాలా కాలంగా ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కావాలని కోరుతోందనీ, తమ సంకీర్ణ ప్రభుత్వం వారి ఈ కోరికను నెరవేర్చిందన్నారు. గిరిజన వర్గాల్లో అత్యంత అణగారిన వర్గాల కోసం జన్‌మన్ యోజనను ప్రారంభించి, వారి అభివృద్ధి కోసం రూ. 25,000 కోట్లు కేటాయించినట్లు శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ఈ దార్శనికతకు అనుగుణంగా ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజననూ రూపొందించామనీ, ఇటీవలే కేంద్ర మంత్రివర్గం ఈ పథకం అమలుకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ పథకం కింద మంచి వ్యవసాయ సామర్థ్యం ఉన్నప్పటికీ దిగుబడి, రైతుల ఆదాయం విషయంలో వెనుకబడిన 100 జిల్లాలను గుర్తించి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ జిల్లాల్లోని రైతులకు ఈ పథకం కింద తగిన మద్దతు లభిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దీని వల్ల దేశవ్యాప్తంగా దాదాపు 1.75 కోట్ల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందనీ, దీనిలో బీహార్ రైతుల వాటా చాలా ఎక్కువేనని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

వేల కోట్ల విలువైన రైల్వే, రహదారుల ప్రాజెక్టుల ప్రారంభోత్సవం.. శంకుస్థాపనలను ప్రస్తావిస్తూ ఈ ప్రాజెక్టులు బీహార్ ప్రజల సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరస్తాయని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నాలుగు వేర్వేరు మార్గాల్లో ప్రయాణించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయన ప్రారంభించారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఇప్పుడు మోతీహారి-బాపూధామ్ నుంచి ఢిల్లీలోని ఆనంద్ విహార్ వరకు నేరుగా నడుస్తుందన్నారు. మోతీహారి రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలు, కొత్త హంగులతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. దర్భాంగా-నర్కటియాగంజ్ రైలు మార్గం డబ్లింగ్ వల్ల ఈ మార్గంలో ప్రయాణ సౌలభ్యం బాగా మెరుగవుతుందన్నారు.

భారతదేశ సంస్కృతి, విశ్వాసాలతో చంపారన్‌కు ఉన్న లోతైన అనుబంధాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ.. రామ-జానకి మార్గం మోతీహారిలోని సత్తార్‌ఘాట్, కేసరియా, చకియా, మధుబన్ గుండా వెళ్తుందని మోదీ పేర్కొన్నారు. సీతామర్హి నుంచి అయోధ్య వరకు ఉన్న కొత్త రైల్వే మార్గం చంపారన్ నుంచి అయోధ్యకు వెళ్లే భక్తులకు ప్రయాణ సౌలభ్యాన్ని అందిస్తుందని అన్నారు. ఇవన్నీ బీహార్‌లో అనుసంధానతను గణనీయంగా పెంచుతాయని, ఇక్కడ కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని తెలిపారు.

గత ప్రభుత్వాలు పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజన వర్గాల పేరుతో చాలా కాలం రాజకీయాలు చేశాయని అన్నారు. వారి సమానహక్కులను తిరస్కరించటమే కాకుండా కుటుంబేతరులకు గౌరవాన్ని ఇవ్వటంలో కూడా అవి విఫలమయ్యాయని విమర్శించారు. బీహార్ నేడు వారి అహంకారాన్ని స్పష్టంగా తెలుసుకుంటోందని పేర్కొన్నారు. దురుద్దేశంతో కూడిన వారి ఆలోచనల నుంచి బీహార్‌ను రక్షించాలని పిలుపునిచ్చిన ఆయన.. ప్రస్తుత బీహార్ ప్రభుత్వం అంకితభావంతో చేసిన పనులను ప్రశంసించారు. అందరూ సమష్టిగా బీహార్ అభివృద్ధిని వేగవంతం చేసి, మంచి భవిష్యత్తు వైపు పయనించాలని కోరారు. కొత్త బీహార్‌ను నిర్మించేందుకు ఉమ్మడి సంకల్పంతో ముందకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇవాళ ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో ప్రజలకు మరోసారి అభినందనలు తెలియజేస్తూ ఆయన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో బీహార్ గవర్నర్ శ్రీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, బీహార్ ముఖ్యమంత్రి శ్రీ నితీష్ కుమార్.. కేంద్ర మంత్రులు శ్రీ జితన్ రామ్ మాంఝీ, శ్రీ గిరిరాజ్ సింగ్, శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, శ్రీ చిరాగ్ పాశ్వాన్, శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, శ్రీ నిత్యానంద రాయ్, శ్రీ సతీష్ చంద్ర దూబే, డాక్టర్ రాజ్ భూషణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రైలు, రోడ్డు, గ్రామీణాభివృద్ధి, మత్స్య, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక రంగాలకు సంబంధించిన కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

అనసంధానత, మౌలిక సదుపాయా లను పెంచే విషయంలో ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తూ పలు రైలు ప్రాజెక్టులను ప్రధానమంత్రి దేశానికి అంకితం చేశారు. సమస్తిం హార్, బచ్వారా మధ్య రైల్వే కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కల్పించేలా సంబంధింత మార్గంలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ప్రారంభించారు.

దర్భంగా-సమస్తిపూర్ డబ్లింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా రూ. 580 కోట్లకు పైగా వ్యయంతో దర్భంగా-తల్వారా, సమస్తిపూర్-రాంభద్రపూర్ మార్గాల్లో చేపట్టిన రెండో మార్గానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ డబ్లింగ్ పనులు వల్ల రైల్వే సామర్థ్యం పెరగటమే కాకుండా రైళ్ల రాకపోకల్లోని జాప్యం తగ్గుతుంది.

పలు రైలు ప్రాజెక్టులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేసారు. పాటలీపుత్రలో వందే భారత్ రైళ్ల నిర్వహణ కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టు.. రైల్వే కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు భట్నీ-చాప్రా గ్రామీణ రైలు మార్గంలో (114 కి.మీ) ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ? ట్రాక్షన్ సిస్టమ్ మౌలిక సదుపాయాలను పెంచటంతో పాటు ఇంధన సమర్థతను పెంపొందించటం ద్వారా అధిక వేగంతో నడిచే రైళ్లను ప్రారంభించేందుకు భట్నీ-చాప్రా గ్రామీణ విభాగంలో ట్రాక్షన్ వ్యవస్థను మెరుగుపరచడం వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. దీనితో పాటు సంబంధించి రైలు మార్గాల సామర్థ్యాన్ని పెంచేందుకు.. మరిన్ని ప్రయాణ, సరుకు రవాణా రైళ్లను రాకపోకలు సాగించేందుకు, ఉత్తర బీహార్‌తో దేశంలోని మిగిలిన ప్రాంతాల మధ్య అనుసంధానతను పెంచేందుకు రూ.4,080 కోట్ల వ్యయంతో కూడిన దర్భంగా-నర్కటియాగంజ్ రైలు మార్గం డబ్లింగ్ ప్రాజెక్టుకు కూడా పునాది రాయి వేశారు.

ఈ ప్రాంతంలో రోడ్డు రవాణాకు సంబంధించిన మౌలిక సదుపాయాలకు భారీ ఊతం ఇస్తూ ఎన్‌హెచ్-319లోని అరా బైపాస్ మార్గాన్ని 4 వరసలుగా విస్తరించే పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఇది అరా-మోహానియా ఎన్‌హెచ్-319, పాట్నా-బక్సర్ ఎన్‌హెచ్-922లను అనుసంధానిస్తూ ఆటంకం లేని అనుసంధానతను అందించటమే కాకుండా ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుంది.

ఎన్‌హెచ్-319లో పరారియా-మోహానియా మధ్య రూ. 820 కోట్లతో చేపట్టిన 4 వరుసల మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. ఇది అరా పట్టణాన్ని ఎన్‌హెచ్-02తో (స్వర్ణ చతుర్భుజి) కలుపుతుంది. ఇది సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మెరుగుపరుస్తుంది. ఎన్‌హెచ్-333సీ లో సర్వాన్, చకై మధ్య పాదచారుల మార్గంతో చేపట్టిన 2 వరుసల రహదారిని కూడా ప్రారంభించారు. ఈ మార్గం సరకు రవాణాతో పాటు ప్రజల రాకపోకలను సులభతరం చేయటమే కాకుండా బీహార్, జార్ఖండ్ మధ్య కీలక మార్గంగా పనిచేస్తుంది.

దర్భంగాలో కొత్త సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియాను (ఎస్‌టీపీఐ), ఐటీ/ఐటీఈఎస్/ఈఎస్‌డీఎం పరిశ్రమలతో అంకురాలను ప్రోత్సహించేందుకు పాట్నాలో ఎస్‌టీపీఐకి చెందిన అత్యాధునిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సౌకర్యాలు ఐటీ, సాఫ్ట్‌వేర్, సేవా రంగ ఎగుమతులను పెంచేందుకు సహాయపడతాయి. ఇది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కావాల్సిన సాంకేతిక అంకుర వ్యవస్థను రూపొందిస్తుంది. అంతేకాకుండా ఆవిష్కరణ, ఐపీఆర్, కొత్త వస్తువుల రూపకల్పననూ ప్రోత్సహిస్తుంది.

బీహార్‌లో మత్స్య, ఆక్వాకల్చర్ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక ప్రధాన కార్యక్రమం కూడా ప్రధాని పర్యటనలో జరిగింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద మంజూరైన మత్స్య అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇందులో బీహార్‌లోని వివిధ జిల్లాల్లో కొత్త చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, బయోఫ్లోక్ యూనిట్లు, అక్వేరియం చేపల పెంపకం, ఇంటిగ్రేటెడ్ ఆక్వాకల్చర్ కేంద్రాలు, చేపల ఆహారానికి సంబంధించిన మిల్లులతో సహా ఆధునిక మత్స్య రంగ మౌలిక సదుపాయాల ప్రారంభోత్సవం ఉన్నాయి.

# పుస్తకం విప్పితే మస్తకం వికసిస్తుంది

## - సరస్వతి దేవి సేవలో శ్రీమతి కైరంకొండ ఉషారాణి అనిల్ కుమార్ దంపతులు

దగిరిగుట్ట, జులై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ;: విద్యాదానం మహాదానం అన్నారు... విద్యతోనే వికాసం అని కూడా అన్నారు. అందుకే విద్యాభివృద్ధికి యాదగిరిగుట్టకు చెందిన శ్రీమతి కైరంకొండ ఉషారాణి అనిల్ కుమార్ దంపతులు శాయశక్తుల తోడ్పడుతున్నారు . ఈ విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని కైరంకొండ ఉషారాణి అనిల్ కుమార్ దంపతులు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంకు చెందిన సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు ప్రతి విద్యార్థికి ఒక సెట్టు చొప్పున 75 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సంస్కృత విద్యాపీఠం ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎస్ జానకమ్మ తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషారాణి అనిల్ కుమార్ దంపతులను పలువురు అభినందించారు.

# ఆర్మూర్ గురుకులంలో రాలిన విద్యా కుసుమం ..

నిజామాబాద్, జులై 19:రాష్ట్రంలోని గురుకులాల్లో నాలుగు రోజుల వ్యవధిలో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 8 మంది బలవన్మరణం చెందారు. తాజాగా ఆర్మూర్ పట్టణంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థి గడ్డం సంతోశ్ (17) ఆత్మహత్య చేసుకున్నాడు. నేటి ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం తమతో లేచి, అందరితో కలిసి మెలిసి ఉన్నారన్నారు. కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం బయటకు వెళ్లిన సంతోశ్.. చెట్టుకు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుడు నిజాంసాగర్ మండలం ఆరేపల్లికి చెందిన వాడిగా గుర్తించారు.

# మొబైల్ వలస సహాయ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల



హైదరాబాద్ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్రంలోని వలసదారుల మరియు బడుగు, బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి వారి జీవనోపాధి అవకాశాలు పెంచేందుకు మద్దతుగా "మొబైల్ వలస సహాయ కేంద్రాన్ని" గౌరవ వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ లో ప్రారంభించారు. ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) మరియు ఈంఫా సంయుక్త కార్యాచరణగా రూపొందించబడినది. ఈ మొబైల్ వలస సహాయ కేంద్రం (ఎ–ఓఖీఅ) ద్వారా నిజామాబాద్ మరియు నారాయణపేట జిల్లాల్లో వలస వెళుతున్న గ్రామీణ కుటుంబాలకు వలసకు ముందు, వలస సమయంలో మరియు తిరిగి వచ్చాక వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత, సేవలు అందించబడతాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి.గోపీ, ఈంఫా కు చెందిన అగ్రిబిజినెస్ స్పెషలిస్ట్ శ్రీ జగన్మోహన్ రెడ్డి, ఐఓఎం రాష్ట్ర సమన్వయకర్త శ్రీమతి జలజ, ఔచిచి అధ్యక్షురాలు సిస్టర్ లిస్సీ జోసఫ్, ప్రాజెక్ట్ అమలు బృందం తదితరులు పాల్గొన్నారు. డా. గోపీ గారు ఈ సంయుక్త కార్యక్రమ లక్ష్యాలను వివరించి, జిల్లాల స్థాయి అధికారులతో సమన్వయంగా శిక్షణలు నిర్వహించబోతున్నట్లు మంత్రి గారికి తెలియజేశారు. వలస సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తూ మంత్రి మాట్లాడుతూ "ఈ వాహనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి, ఎంపికచేసిన ప్రాంతాల రైతులకు మట్టి పరిక్షలు, సేంద్రీయ వ్యవసాయ విధానాలపై, పశుపాలనపైన వర్చువల్ శిక్షణలు ఇవ్వాలి" అని సూచించారు. ఇకపై ఈ వాహనాల ద్వారా మొబైల్ మట్టి నమూనా పరీక్షలు మరియు పశుసేవల వంటి ఇతర సేవలు కూడా రైతులకు అందించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. జఔ భాగస్వామ్య సంస్థల కృషిని మంత్రి గారు ప్రశంసించారు. ఇక వలస వెళ్ళిన కుటుంబాలలో మహిళలు తరచూ ఇంటిలో ఒంటరిగా మిగిలిపోతున్నారు. అటువంటి మహిళలకు గ్రామాల్లోనే సేవలు అందించేందుకు ఈ మొబైల్ వాహనం ఉపయోగపడుతుంది. ఇది వారిని శక్తివంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది." అని మంత్రిగారు అన్నారు.

# షాద్‌నగర్ డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జులై 19: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, సెరికల్చర్, తెలుగు, జువాలజీ బోధించేందుకు గాను అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్–2, కంప్యూటర్ సైన్స్, సెరికల్చర్, తెలుగు, జువాలజీ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఒక్కొక్క పోస్టు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అతిథి అధ్యాపకుల పోస్టులకు గాను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్టులో 50శాతం, ఇతరులు 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అదే విధంగా పీహెచ్‌డీ, నెట్, స్లెట్, సెట్ అర్హత కలిగి అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24న మౌఖికక పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# నేటి నుంచి తిరుమల శ్రీవారి పుష్కరిణి మూసివేత



తిరుపతి, జులై 19:శ్రీవారి పుష్కరిణి మరమ్మతులు పనులు రేపటి నుంచి ప్రారంభించ నున్నారు.. ఈ పనులు వచ్చే నెల 19వ తేది వరకు కొనసాగుతాయని టిటిడి అధికారులు వెల్లడించారు. శ్రీవారి సాకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏడాది పుష్కరిణి మరమ్మతులు నిర్వహించడం అనవాయితి. ఈ ఏడాది సెప్టెంబరు 24 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో నెల రోజుల ముందుగానే ఈ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. రిపేర్ నేపథ్యంలో ఈ నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదని తెలిపారు అధికారులు. అదేవిధంగా ఈ నెల రోజుల పాటు భక్తులను పుష్కరిణిలోకి అనుమతించబోరని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించాల్సిందిగా భక్తులకు టిటిడి ఒక ప్రకటన విడుదల చేసింది..

# 4 కోట్ల విలువ చేసే భూమిని ప్రభుత్వానికి రాసిచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

హైదరాబాద్ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తన ఉదార స్వభావాన్ని మరోసారి చాటుకున్నారు. తన చిన్నాయన మల్లారెడ్డి ఇచ్చిన భూమి మరియు అందులో నిర్మించిన భవనాన్ని వ్యవసాయ శాఖకు రాసిచ్చారు. యాచారం మండల కేంద్రంలోని 2 వేల గజాల భూమిని వ్యవసాయ శాఖ కు కేటాయిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి భూమికి సంబందించిన పత్రాలను అందించారు. ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్లో 4 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. నెలరోజుల క్రితమే రైతు కమిషన్ బృందం, వ్యవసాయ అధికారులు కలిసి యాచారం మండలంలో పర్యటించారు. ఆ సమయంలో కోదండరెడ్డి ప్రభుత్వానికి ఇవ్వాలనుకున్న భూమిని అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి తోపాటు మార్కెటింగ్ అధికారులకు చూపించారు. ప్రస్తుతం ఆ స్థలంలో రైతు మిత్ర కమ్యూనిటీ భవనం ఉంది. అందులో రైతులు వ్యవసాయ సామాగ్రి, ధాన్యం కొనుగోలు కేంద్రం, సీజన్ పంటలు నిలువ కోసం వాడుకుంటున్నారు. ఐతే ఇక ఆ స్థలాన్ని, ఆ స్థలంలో ఉన్న భవనాన్ని పూర్తిగా వ్యవసాయ శాఖకు రాసిస్తే.. రైతులకు మరింత మేలు జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోదండరెడ్డి తెలిపారు. ఇవాళ సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి లకు ఈ విషయం చెప్పి స్థలానికి సంబంధించి పేపర్స్ ను అందజేశారు. అదేవిదంగా యాచారం మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ ను ఏర్పాటుచేయాలని రైతు కమిషన్ కోరింది. దానికి సంబంధించి ప్రైవేట్ స్థలం యాచారం బస్టాండ్ కు అనుకొనే ఉన్నట్లు కమిషన్ బృందం.. మంత్రి కి వివరించారు. ఆ స్థలాన్ని సేకరించి మార్కెట్ను ఏర్పాటు చేయాలన్నారు. ఇక పలు అంశాలపై వ్యవసాయ మంత్రి తో కమిషన్ చర్చించింది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఏవో హరి వెంకట ప్రసాద్ లున్నారు.

# ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి : పసుపునూరి వీరేశం

నల్గొండ, జులై 19:పాలకుల నిర్లక్ష్యం మూలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆలేరును అభివృద్ధి చేసుకోవాలంటే ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధించుకుంటే తప్పా అభివృద్ధి జరగదని వక్తలు ఉద్ఘాటించారు.

ఆలేరులోని వై ఎస్ ఎస్ గార్డెన్‌లో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు అందరూ ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధించుకోవడం కోసం జరిగే పోరాటంలో పాల్గొనాలని కోరారు. 1952లో ఏర్పడిన ఆలేరు నియోజకవర్గం అభివృద్ధిలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబడి పోయిందన్నారు. అభివృద్ధి కోసం అందరం ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు.

కమిటీ నాయకులు ఆర్. జనార్ధన్, మొరిగాడి చంద్రశేఖర్, చెక్క వెంకటేశ్ మాట్లాడుతూ.. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఈ నెల 22న ఆలేరులో జరిగే బహిరంగ సభ పాలకులకు కనువిప్పు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ నాయకులు కల్లెపు అడివయ్య, మంగ నరసింహులు, కేమిడి ఉప్పలయ్య, పుట్ట మల్లేశ్, ఎండి సలీం, మొరిగాడి వెంకటేశ్, పద్మశ్రీ సుదర్శన్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల సత్యం, బ్రహ్మచారి, కృష్ణ సాయి, పద్మశాలి సంఘం నాయకులు బింగి నరసింహులు, క్లాత్ అసోసియేషన్ నాయకులు బేతి కృష్ణ హరి, మొరిగాడి మహేశ్, ఎం.డి.కుర్షిత్ పాషా పాల్గొన్నారు.

# అనుమానంతో భార్యను చంపి.. భర్త ఆత్మహత్య



తిరుపతి, జులై 19:తిరుపతి నగర సమీపంలోని మంగళం రిక్షా కాలనీలో శనివారం ఒక దారుణం జరిగింది. భార్యభర్తల మధ్య విభేదాలు ఒక దారుణ హత్య, ఆత్మహత్యకు దారి తీశాయి. స్థానికుల వివరాల మేరకు.. మంగళం తిరుమల నగర్‌లో లోకేశ్వర్, అతని భార్య ఉష ఉంటున్నారు. వీరి మధ్య గత కొన్నేళుగా మనస్పర్ధలు నడుస్తున్నాయి. తన భార్య ఉషపై అనుమానం పెంచుకొని, ఆమెను లోకేశ్వర్ నిరంతరం చిత్రహింసలకు గురిచేసేవాడని స్థానికులు తెలిపారు. దీంతో ఉష తన పుట్టింటికి వెళ్లి, అక్కడి నుంచి ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది.

ఈ క్రమంలో ఉష శనివారం ఉదయం విధులకు వెళుతుండగా, మంగళం రిక్షా కాలనీ సమీపంలో లోకేశ్వర్ ఆమెను కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన సమాచారం అందుకున్న జిల్లా శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పీ రవి మనోహర్ ఆచారి, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్, ఎస్ఐ జగన్నాథ్ రెడ్డి, సిబ్బంది నేర స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉషను హత్య చేసిన అనంతరం, లోకేశ్వర్ తిరుమల నగర్‌లోని తన అద్దె ఇంటికి వెళ్లి, అక్కడ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని లోకేశ్వర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య, ఆత్మహత్యలకు భార్యాభర్తల మధ్య అనుమానాలే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

విడాకుల కేసు నేపథ్యం

ఈ దంపతుల మధ్య విడాకుల కేసు చివరి దశలో ఉన్నట్లు తెలుస్తోంది. విడాకుల కేసులో భరణం కట్టాల్సిన పరిస్థితి లోకేశ్వర్‌పై ఉందని, ఇది కూడా హత్యకు ఒక కారణం కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీకి తరలించారు. ఉష మృతదేహం వద్ద ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆర్తనాదాలు వర్ణణాతీతం. భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైన ఉష మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వారినందరినీ కలిచివేశాయి. ఈ ఘటనపై పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు సాక్ష్యాలను సేకరిస్తున్నారు. స్థానికుల నుంచి సమాచారం తీసుకుంటూ, ఈ దంపతుల మధ్య విభేదాలకు గల కారణాలను లోతుగా పరిశీలిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ 50 శాతం పూర్తి చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ, జులై 19: కట్టంగూర్ మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ బుధవారం నాటికి 50 శాతం పూర్తి కావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రౌండింగ్ కానీ గ్రామాల్లో వెంటనే ఇండ్ల నిర్మాణాలు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండింగ్ పురోగతి లేనట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆది, సోమవారాలు కూడా పంచాయతీ కార్యదర్శులు పని చేస్తూ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు.

వన మహోత్సవం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం గుంతల తవ్వకం, మొక్కలు నాటడం సకాలంలో పూర్తి చేయాలని ఏపీఓకు సూచించారు. మండలంలో ఉన్న అసైన్డ్ భూములన్నీ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ యారాల అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, డిప్యూటీ తాసీల్దార్ అల్బర్ట్ ఫ్రాంక్లిన్, ఏపీఓ కడెం రాంమోహన్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు జయసుధ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలి

## –పనులను అడ్డుకున్న భూ నిర్వాసితులు



నల్లగొండ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : జాతీయ రహదారి 565 పానగల్లు నుండి సాగర్ రోడ్డు వరకు భూములు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని శనివారం భూ నిర్వాసితుల పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడు సయ్యద్ హాశం, కో కన్వీనర్లు దోనాల నాగార్జున రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పనులను అడ్డుకున్నారు. సుమారు రెండు వందల మంది బాధితులు గిరకబాయిగూడెం హౌసింగ్ బోర్డు మధ్యలో జాతీయ రహదారి 565 కాంట్రాక్టర్ క్యాంప్ కార్యాలయం వద్దకు వెళ్లి వాహనాలు బయటకు రాకుండా అడ్డుకుని నిరసన తెలిపారు. తమకు న్యాయం జరిగేంత వరకు పనులు నిలిపివేయాలని నినాదాలు చేశారు. క్యాంప్ కార్యాలయ మేనేజర్ సత్యం ఆందోళన విరమించాలని బాధితులను కోరారు. నష్ట పరిహారం తమ పరిధిలోనిది కాదని చెబుతూ వారితో చర్చలు జరిపారు. సుమారు 14 కిలోమీటర్ల బైపాస్ రోడ్డులో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు పనులు ప్రారంభించాలని బాధితులు కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హామీ మేరకు సుమారు 1,250 మంది నిర్వాసితులు ఉన్నట్లు గుర్తించారని, వారందరికి నష్ట పరిహారం సంతృప్తికరంగా అందేవరకు రోడ్డు పనులు నిలివేయాలన్నారు. బాధితులందరికీ నష్ట పరిహారం అందిన తర్వాతే రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామని, అంతవరకు ఏ ఒక్క రైతు భూమిలో కూడా రోడ్డు వేయమని మేనేజర్ సత్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# పిడుగుపాటుకు రైతు మృతి

ఖమ్మం, జులై 19: పిడుగుపాటుకు రైతు మృతి చెందిన సంఘటన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం వెంకటాయతండా గ్రామంలో చోటుచేసుకుంది. చండ్రుగొండ మండలం వెంకటయతండా గ్రామానికి చెందిన రైతు బానోతు రవి (38) తన పత్తి చేనులో అరకతో పైపాటు చేస్తుండగా శనివారం సాయంత్రం వేళలో ఉరుములతో కూడిన వర్షం అకస్మాత్తుగా ప్రారంభమైంది. ఈ క్రమంలో పంట చేనులో ఉన్న రైతు బానోతు రవిపై పిడుగు పడిపోయాడు. వెంటనే తోటి రైతులు గ్రామస్తులు కలిసి హుటాహుటిన చండ్రుగొండలోనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రవికి భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, తోటి రైతులు కోరుతున్నారు.

# రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బీజేపీ ఆలేరు నాయకుల వినతి



నల్గొండ, జులై 19:రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం సికింద్రాబాద్ నుండి కాజీపేటకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకుల కోరిక మేరకు ఆలేరు రైల్వే స్టేషన్‌లో ఆగిన ఆయనకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పట్టణాధ్యక్షుడు నంద గంగేశ్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా రైల్వే మంత్రిని కోరారు. ఆలేరు రైల్వే అండర్ పాస్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి, గుండ్లగూడెం గేటు వద్ద అండర్‌పాస్ మంజూరు అలాగే ఆలేరు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను ఆపాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూజారి కుమార్, బడుగు జాంగిర్, కామిటికారి కృష్ణ, చిరిగే శ్రీనివాస్, బైరి మహేందర్ గౌడ్, పార్టీ వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాలయాలలో మత కార్యకలాపాలకు తావు లేదు : ప్రొఫెసర్ లక్ష్మినారాయణ



మెదక్, జులై 19 : భారత రాజ్యాంగ భావజాలానికి విరుద్ధంగా ప్రభుత్వ విద్యాలయాల్లో మత ప్రచార కార్యక్రమాలకు తావులేదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కే లక్ష్మినారాయణ అన్నారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ బూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో గిరిజన టీచర్ డాక్టర్ నరేందర్ నాయక్‌పై దాడి చేసిన బీజేవైఎం దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, పాఠశాలలోకి మనువాదుల చొరబాటును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత గిరిజన, బహుజన, మైనారిటీ సంఘాల అధ్వర్యం లో శనివారం మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సులో ప్రొఫెసర్ కే లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. పథకం ప్రకారం దళిత, గిరిజన, బహుజన, మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. డీఈఓ విచారణ చేయకుండా గిరిజన టిచర్‌కు ఇచ్చిన నోటిసులు ఉపసంహరించుకోవాలన్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో మనువాదాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.

టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్ కుమార్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కోటగిరి తెలుగు పండిట్ మల్లికార్జున్‌పై, తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుపై, బూర్గపల్లి నరేందర్ నాయక్‌పై, యలాల్ ఉపాధ్యాయురాలు కాశీంబాయిపై దాడులు చేశారన్నారు. విద్యాలయాలలో ప్రార్థన చేయడానికి కోడ్‌ను జారీ చేయాలన్నారు. పాఠశాలలో లౌకికవాద వాతావరణాన్ని పెంపొందించాలన్నారు.

ఈ సదస్సులో సీనియర్ దళిత నాయకులు రామస్వామి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి అహ్మద్, లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్ నాయక్, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామాల అశోక్, నాయకులు పెంటన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్ రాజు, సామేల్, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి దయాసాగర్, మిల్లి అధ్యక్షుడు ఉమర్ ఖాన్, జావిద్ మౌలానా, డాక్టర్ సూఫి ఆలీ, వివిధ సంఘాల నాయకులు ప్రకాశ్ రాథోడ్, రాధాకృష్ణ, న్యాయవాది దివాకర్, ఇస్సాక్, పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో ఏడుగురు ఎస్ఐలు బదిలీ

నల్గొండ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : నల్లగొండ జిల్లాలో ఏడుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఐజీ ఉత్తర్వుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సంబంధిత ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ముగ్గురు ఎస్ఐలను నల్లగొండ జిల్లాకు, నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న మరో ముగ్గురు ఎస్ఐలను, వీఆర్‌లో ఉన్న మరో ఎస్ఐని బదిలీ చేశారు. కనగల్ ఎస్ఐగా ఉన్న విష్ణుమూర్తిని, గట్టుప్పల్ ఎస్ఐగా ఉన్న వెంకట్‌రెడ్డిని సీసీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న సీహెచ్ బాలకృష్ణను డిండి పోలీస్ స్టేషన్‌కు, డిండి ఎస్ఐ రాజును యాదాద్రి జిల్లాకు, ఇతర జిల్లాల నుండి వచ్చిన కె.రాజీవ్‌రెడ్డిని కనగల్‌కు, ఎం.సంజీవరెడ్డిని గట్టుప్పల్‌కు, నాగేంద్రబాబును నేరేడుగొమ్ముకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సమాజ హితం కోసమే పోలీసు వ్యవస్థ : ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్

మెదక్, జులై 19: పోలీస్ వ్యవస్థ అనేది సమాజం హితం కోసం పనిచేస్తుందని పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నో బ్యాగ్ డే పురస్కరించుకొని పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్ఐ పోలీస్ సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని విభాగాల గురించి, వారి విధుల గురించి వివరించారు.

ఫిర్యాదుదారులు వస్తే ఎలా వ్యవహరిస్తారు.. ఎస్ఐ విధులు ఎన్ని రకాలుగా ఉంటాయి.

పోలీస్ వ్యవస్థ సమాజం కోసం ఎలా పని చేస్తుంది తదితర విషయాల గురించే కాకుండా సైబర్ నేరాల నుండి ఎలా రక్షించుకోవాలి..రోడ్డు ప్రమాదాల పాడిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి. తదితర విషయాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలోఇంచార్జి హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు, అంజా గౌడ్, ప్రవీణ్, భట్టు నాగరాజు, నింగప్ప, మోహన్ రావు, రమేష్ , శ్రీహరి , శ్రవణ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

